بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ     نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ     وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

బదర్
తెలుగు వార పత్రిక
Weekly
BADAR
Qadian
Telugu

సంపుటి 5
సంచిక 43
వార్షిక చందా 500/-రూ॥

www.akhbarbadrqadian.in

22 అక్టోబర్ 2020, 04 రబీఉల్ అవ్వల్ 1442, హి.ఖ. 22 ఇఖా 1399.

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్, అల్లాహ్ తాలా దయతో క్షేమంగా యున్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి ఆయురారోగ్యముల కొరకు, ఉన్నత ఆశయ సాధనాల కొరకు, వారి ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ ను అనుక్షణం రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).*

اَللّٰھُمَّ اَیِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ
وَبَارِکۡ لَنَا فِیۡ عُمُرِہٖ وَاَمۡرِہٖ

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

یٰۤاَیُّہَا الَّذِیۡنَ اٰمَنُوۡا
خُذُوۡا حِذۡرَکُمۡ
فَانۡفِرُوۡا ثُبَاتٍ
اَوِ انۡفِرُوۡا جَمِیۡعًا ○

అనువాదం: ఓ విశ్వాసులారా! మీ రక్షణ సామాగ్రిని ఏర్పాటు చేసుకోగలరు, అందుకోసం చిన్న చిన్న బృందాలు గానైన, పెద్ద పెద్ద బృందాలుగానైన బయలు దేరుము. (నిసా: 72)

## అల్లాహ్ తాలా ఉనికి కాకుండా మరే ఉనికి కూడ ఇలాంటి బాధ కరమైన , విచారణకరమైన అంశాల నుండి విముక్తి కల్గించలేదు. అందుకోసమే నేను ఎల్లప్పుడు దుఆలలో నిమగ్నమై ఉంటాను.

**ఉపదేశము: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం**

వాస్తవవేమనగా నాతో నా మిత్రుల వ్యవహారము అవయవాలను పోలినట్లు ఉండును. ఈ విషయం నా రోజువారి కార్యక్రమముల వలన నిరూపించ బడుతుంది. ఉదా॥ ఒక చిన్నపాటి వ్రేలు కు నొప్పి పుట్టినప్పుడు శరీరమంతయు ఆందోళన కరముగా, అస్వస్థతగా ఉంటుంది. సరిగా ఇదే విధముగా నా మిత్రులందరు సౌకర్యవంతముగా, క్షేమముగా ఉండాలని అన్ని వేళల, అన్ని సమయాలలో ఆలోచిస్తూ, విచారిస్తూ ఉంటాను. ఈ సానుభూతి ఈ అవేధన ఏదేని బాధతో గాని, కల్పితముగా గాని చూపడం లేదు. కేవలం ఒక తల్లి, తనకు ఎంత మంది పిల్లలు ఉన్నను తన పిల్లలందరు సౌకర్యంగా, క్షేమముగా ఉండాలని కోరుకుంటుందో అదే విధముగా నేను కేవలం అల్లాహ్ తాలా ప్రీతి కొరకు ఈ బాధను, ఆవేధనను నా మిత్రుల కొరకు నా హృదయంలో అనుభవిస్తున్నాను. వారి పట్ల గల ఈ సానుభూతి ఎంత ఆందోళన కరముగా ఉండుననగా, నా మిత్రులలో ఎవరైన ఒకరు తాను ఏదేని బాధలో చిక్కుకున్నానని లేదా అనారోగ్యమునకు గురి అయ్యానని నాకు ఉత్తరము వ్రాసినచో నా మనసంత ఆవేధన చెందుతూ, భయాన్ని కల్గిస్తుంది. అలా ఆవేధన తోడవుతుంది. క్రమేణా సభ్యుల సంఖ్య పెరిగిన కొలది, ఆవేధన కూడ పెరుగుతుపోతుంది. అప్పుడు ఏ సమయం కూడ నన్ను ఆవేధన, బాధ లేకుండా వదిలివేయదు. ఎందుకనగా ఇంత మంది సభ్యులలో ఎవరో ఒకరు, ఏదో ఒక రకమైన తీవ్ర ఇబ్బందికి గురి అయ్యి ఉంటారు. ఈ విషయం తెలిసినప్పుడు మనస్సు మనస్సులో ఉండకుండా, కలత చెందుతూ విచారణలోకి వెళ్ళిపోవును. ఎంత సమయం ఆవేధనలో గడుస్తుంది అనే విషయాన్ని నేను ఖచ్చితముగా చెప్పలేను. ఎందుకనగా కేవలం అల్లాహ్ తాలా ఉనికి కాకుండా మరే ఉనికి కూడ ఇలాంటి బాధ కరమైన , విచారణకరమైన అంశాల నుండి విముక్తి కల్గించలేదు. అందుకోసమే నేను ఎల్లప్పుడు దుఆలలో నిమగ్నమై ఉంటాను. దుఆలలో అన్నింటి కన్న ముందు నా మిత్రులను అన్ని రకాల బాధల నుండి, ఆపదల నుండి కాపాడమని దుఆ చేయుదును. ఎందుకనగా వారి సమస్యలే నన్ను బాధలలోకి, ఆవేధనలోకి నెట్టి వేస్తుంటాయి. ఏ వ్యక్తికైన, బాధ కల్గినప్పుడు, సమస్య వచ్చినప్పుడు సామూహిక దృకోణంతో అందరి కోసం దుఆ చేయడం జరుగుతుంది. ఫలితముగా అల్లాహ్ తాలా వారికి ఆయా సమస్యల నుండి విముక్తి చేకూర్చును. అల్లాహ్ తాలాతో దుఆ చేయాలనే ఉత్సాహము, తొందర పాటు తనం అధికముగా ఉంటుంది. దుఆలు ఆమోదించబడుతాయని ఎంతో సమ్మకం ఏర్పడుతుంది.

## హజ్రత్ ఈసా (అ) ను గూర్చి కూడ ఈ రెండు దైవ విశిష్టతలనే పేర్కొనడం జరిగింది.

**అనువాదం**: మరియమ్మ కుమారుడు ఏసు ఇట్లనెను. ఓ ఇస్రాయిల్ సంతతి ప్రజలారా! నిశ్చయముగా నేను మీ వద్దకు అల్లాహ్ ప్రవక్తగా వచ్చిన వాడను. తౌరాత్‌లో నుండి నా ముందున్న దానిని ధృడపరచుచు, ఒక గొప్ప ప్రవక్త శుభవార్త నిచ్చుచున్నాను. అతడు నా తరువాత వచ్చును. అతని నామము అహ్మద్. కనుక అతడు స్పష్టమైన సంకేతములతో వచ్చినప్పుడు వారిట్లనిరి. ఇదొక స్పష్టమైన మంత్రజాలము.

అతనిని ఇస్లాం వైపు పిలువబడినను అల్లాహ్ కు అబద్దము అంటగట్టు వానికంటే అన్యాయుడు ఎవడుండును.? అల్లాహ్ అన్యాయపు జాతికి మార్గదర్శనము చేయదు. (అస్సఫ్: 7,8)

**సయ్యదినా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజియల్లాహు తాలా అనుహు 7వ సూక్తిని ఈ విధముగా విశదీకరించిరి:** ఈ సూక్తిలో హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి గలదు. ఈ విషయము బర్నిబాస్ ఇంజీల్‌లో కూడ వ్రాసి ఉంది. కాని క్రైస్తవులు ఈ ఇంజీల్‌ను కల్పితమైనదిగా భావించెదరు. అయినా కూడ ఇది పోప్ గారి గ్రంథాలయములో భద్రపర్చి ఉన్నది. ఇదేగాకుండా పురాతన ఇంజీల్‌లో ఫారే ఖలీత్‌ను గూర్చిన భవిష్యవాణి గలదు. ఆ పద అర్థం కూడ అహ్మద్‌గానే వచ్చును. ఇది కూడ ఒక ఆధారమే. కావున ఈ సూక్తిలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను గూర్చి పరోక్షముగా పేర్కొనుచు వారి ప్రతిరూపమును గూర్చిఈ సూక్తి తరువాత సూక్తిలో ప్రత్యక్షముగా సువార్త నందించడమైనది. (10వ పేజిలో చదవగలరు)

## ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బోధనలు

**ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జొహర్ మరియు అసర్ నమాజ్ చదువించునప్పుడు అప్పుడప్పుడు ఒక్కొక్క సూక్తి మాకు వినిపించేది:**

హజ్రత్ అబూ ముఅమ్మర్ ఇలా తెల్పినారు: ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జొహర్ మరియు అసర్ నమాజ్‌లో ఖుర్ఆన్ మజీద్ పఠించేవారా? అని నేను హజ్రత్ ఖబ్బాబ్ రజి బిన్ అరత్‌ను ప్రశ్నించగా, వారు అవును అని సమాధానం ఇచ్చారు. హుజూర్ (స) పఠించిన విషయం నీకు ఎలా తెలుసు? అని నేను వారిని మరల ప్రశ్నించగా, హుజూర్ (స) గడ్డం కదులుతుండగా తెలుసుకున్నాను అని సమాధానం ఇచ్చారు.

అబూ ఖతాదహ్ ఇలా తెల్పినారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జొహర్ మరియు అసర్ నమాజ్‌లలో మొదటి రెండు రకాతులలో ఫాతిహతో పాటు ఇతర సూరాహ్‌లను కూడ పఠించేవారు, అప్పుడప్పుడు కొన్ని సూక్తులు మాకు వినిపించేవి.

హజ్రత్ బరఅ రజియల్లాహ్ తాలా అన్‌హు ఇలా తెల్పినారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇషా నమాజ్‌లో వత్తీని వజ్జైతూన్ ను పఠించుచుండగా నేను విన్నాను. హుజూర్ (స) వలె మధురముగా పఠించువారిని నేను మరొకరిని చూడలేదు.

హజ్రత్ జాబిర్ రజి బిన్ సమ్రహ్ ఇలా తెల్పినారు: హజ్రత్ ఉమర్ రజి హజ్రత్ సఅద్ బిన్ అబీ వఖాస్ రజితో అన్ని విషయాలలో ప్రజలు నీపై ఫిర్యాదులు చేస్తున్నారు, చివరికి నమాజ్ విషయంలో కూడ అని తెలుపగా అందుకు హజ్రత్ సఅద్ రజి "నేను కూడ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి నమాజ్ వలే ప్రజలకు జొహర్ మరియు అసర్ నమాజ్‌లను చదువించేవాడిని. ఆ విధానంలో నేను ఏ కొద్ది పాటి వ్యత్యాసాన్ని కూడ రానివ్వలేదు. మొదటి రెండు రకాతులను ఎక్కువ సమయం చదువించే వాడిని, తదుపరి రెండు రకాతులను తక్కువ సమయం చదువించే వాడిని" అని తెలుపగా, అందుకు హజ్రత్ ఉమర్ రజి " నీ విషయంలో నాకు ఇలాంటి నమ్మకమే ఉన్నది" అని ఉమర్ రజికు సమాధానం ఇచ్చారు.

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

సంపాదకీయం:-

భూమండలంపై నుండి కనుమరుగైన దైవారాధనను పున: స్థాపించడమే ప్రవక్తల ప్రథమ కర్తవ్యం. ప్రజలు తమను విశ్వసించాలని, తమ సృష్టికర్తను గుర్తించాలని, ఏకేశ్వర ఆరాధన ఆధిక్యము సాధించాలని మన ప్రియతమ నాయకులు సయ్యదినా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాము అలైహి వసల్లం చాలా ఆకాంక్షను కల్గి ఉండేవారు. ప్రజలు తమను విశ్వసించాలనే ఆకాంక్ష వారి హృదయములో ఎంతగా ఉండేదనగా చివరికి అల్లాహ్ తాలాయే " **లా అల్లక బాఖిఉన్ నఫ్సక అల్లా యకూనూ మోమినీన్** " అనగా ఓ ముహమ్మద్! (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రజలు ఎందుకు విశ్వసించడం లేదనే ఆవేదనతో నీవు నిన్ను నాశనం చేసుకుందువా? అని ఓదార్చవలసి వచ్చింది. హదీస్‌లో ఈ విధముగా గలదు. ఒక సందర్భములో ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ అలీ రజియల్లాహు తాలా అనుహుకు ప్రచార ప్రాముఖ్యతను తెల్పుచూ ఇలా వివరించిరి. దేవుని సాక్షిగా తెల్పుచున్నాను!, ఒకవేళ నీ ద్వారా ఏ ఒక్క వ్యక్తి అయినా మార్గదర్శనం పొందినచో అది నీకు ఎర్రని ఒంటె లభించిన దానికన్న ఉత్తమమగును.

**(ముస్లిం కితాబుల్ ఫజాయిల్ ఫజాయిల్ అలీ బిన్ అబూతాలిబ్, బుఖారి కితాబుల్ జిహాద్. ఆధారం: హదీఖతుస్సాలిహీన్ హదీస్: 335)**

ఎవరైనా విశ్వసించినచో ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతగా సంతోషపడేవారో తెలలియజేయు కొన్ని ఉదాహరణలను పాఠకుల ముందు ప్రవేశపెట్టడం జరుగుతుంది. పాఠకులు వీటి ద్వారా ప్రచార ప్రాముఖ్యతను గుర్తించగలరు.

హజ్రత్ అనస్ (రజి) ఇలా ఉల్లేఖించిరి: ఒక యూదుని కుమారుడు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సేవకునిగా పని చేసేవాడు, ఒకసారి అనారోగ్యమునకు గురి అయ్యెను. ఆం హజ్రత్ సల్లల్లాము అలైహి వసల్లం అతనిని పరామర్శించుటకు వెళ్ళిరి. అతని తల వద్ద కూర్చొని అతని స్థితిగతులన్నింటిని అడిగి తెలుసుకొనిరి. ఆ తరువాత ఇస్లాం స్వీకరించమని ప్రోత్సహించిరి. ఆ బాలుడు తన ప్రక్కనే ఉన్న తన తండ్రి వైపు చూసెను. అందుకు అతని తండ్రి హుజూర్ (స) సూచనను పాటించమని సమ్ముఖతను తెలుపెను. ఫలితముగా ఆ బాలుడు ఇస్లాంను స్వీకరించెను. ఆ సమయంలో ఈ బాలుడిని నరకపు అగ్ని నుండి కాపాడిని అల్లాహ్‌కే సకల ప్రశంసలని కొనియాడుతూ ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎంతో సంతోషముతో అక్కడి నుండి వచ్చిరి. **(బుఖారి, కితాబుల్ జనాయిజ్, బాబ్ ఇజా అస్‌లమ సబియ్యు ఫమాత హల్ యుసల్లి అలైహి. ఆధారం హదీఖతుస్సాలిహీన్ హదీస్ :586)**

ఇస్లాంను గూర్చి ప్రచారం చేయడం నిశ్చయముగా వారి ప్రథమ కర్తవ్యం. వారు తమ కర్తవ్యమును జీవితమంతయు నెరవేర్చిరి. కాని ఈ ప్రచారం వెనుక మానవజాతి పట్ల వారికి గల అమితమైన ప్రేమానురాగాలు, కరుణా కటాక్షములు కూడ తమ పాత్రను పోషించాయి. మానవజాతి పట్ల అవతారులు జన్మనిచ్చిన తల్లి కన్న అధికముగా ప్రేమను వాత్సల్యమును చూపుతుంటారు. అందువలనే ఒక సేవకుడు విశ్వసించడం వలన అతడు నరకపు అగ్ని నుండి కాపాడబడినాడని హుజూర్ (స) ఎంతో సంతోషమును వ్యక్తపర్చిరి. ఈ క్రమంలోనే అద్దాస్ విశ్వసించిన విశ్వాసపు ఘట్టమును మీ ముందు ప్రస్తావించెదను.

ప్రవక్తృత్వపు 10వ సంవత్సరములోని షవ్వాలు మాసంలో ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒంటరిగా తాయిఫ్ నగరానికి ప్రచార నిమిత్తం వెళ్ళిరి. మరి కొన్ని ఉల్లేఖనంలో వారి (స) కు తోడుగా హజ్రత్ జైద్ బిన్ హారిస్ వెళ్లినట్లు గలదు. అక్కడికి చేరుకోని హుజూర్ (స) 10 రోజులు బస చేసిరి. నగరంలోని ధనికులందరితో ఒకరి తరువాత మరొకరిని కలుసుకుంటూ వచ్చిరి. దురదృష్టవశాత్తు ఆ సమయంలో మక్కా వలే ఆ నగరానికి కూడ విశ్వాసం పొందు భాగ్యం లేకుండెను. అందుకే అందరు తిరస్కరించారు పైగా హేళన కూడ చేసారు. చివరికి వారు తాయిఫ్ నగరంలోని ప్రముఖ ధనికులైన అబ్దుయాలీల్ వద్దకు వెళ్ళి ఇస్లాం ప్రచారం చేసిరి. కాని అతడు కూడ అందరి వలే తిరస్కరించెను. పైగా అవమానపరుస్తూ " ఒకవేళ నీవు సత్యవంతుడవే అయినచో నేను నీతో మాట్లాడుటకు అర్హుడను కాదు, ఒకవేళ నీవు అసత్యవంతుడవే అయినచో నీకు నాతో మాట్లాడవలసిన అవసరం లేదు " అని సమాధానం ఇచ్చెను. మరల హుజూర్ (స) ప్రచారానికి నగర యువకులు ఎక్కడ ప్రభావితులైపోతారో అనే భయంతో మరల హుజూర్ (స)తో " మీరు ఇక్కడి నుండి వెళ్ళిపోవడమే మంచిది. ఎందుకనగా ఇక్కడ ఎవరు కూడ మీ ప్రచారాన్ని వినుటకు సముఖముగా లేరు" అని తెలుపెను. ఆ తరువాత అతడు నగరానికి చెందిన కొంతమంది ఆవార యువకులను హుజూర్ (స) వెంట పంపెను. ఆం హజ్రత్ సల్లల్లాము అలైహి వసల్లం నగరం నుండి బయటకు వెళ్ళుచున్న సమయంలో వారందరు అరుపులు అరుస్తూ వారి (స) ను వెంబడించిరి. హుజూర్ (స) పై రాళ్ళు రువ్విరి. అందువలన హుజూర్ (స) శరీరమంతయు రక్తంతో నిండెను. మూడు మైళ్ళ దూరం వరకు ఆవార యువకులు హుజూర్ (స)ను దూషిస్తూ, రాళ్ళు రువ్వుచూ వెంబడించిరి.

తాయిఫ్ నుండి 3 మైళ్ళ దూరంలో మక్కా సంపన్నుడైన ఉత్బా బిన్ రబీయ తోట గలదు. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ తోటలోకి ప్రవేశించి ఆశ్రయం పొందిరి. ఆ దుర్మార్గులు అలసిపోయి వెనుదిరిగి పోయిరి. చివరికి వారు (స) ఒక నీడలో నిలబడి అల్లాహ్ తాలాతో ఇలా దుఆ చేసిరి:

"ఓ అల్లాహ్! నేను నా బలహీనశక్తి వలన, ప్రణాళిక విఫలం చెందడం వలన, ప్రజలను ఎదుర్కొనుటలో నా నిస్సహాయత వలన నేను నీ వద్దనే పిర్యాదు చేయుచున్నాను. ఓ నా దేవా! నీవే అందరికన్న ఎక్కువ దయచూపువాడవు. బలహీనుల మరియు నిస్సహాయుల రక్షకుడవు నీవే. నీవే ఆరాధ్యుడవు...... నేను నీ నుండి వెలువడు కాంతిలోనే ఆశ్రయంను వేడుకొనుకుచున్నాను. ఎందుకనగా అంధాకారములను తొలగించువాడవు నీవే. ఇహపరలోకాల అనుగ్రహాలకు నీవే మానవులను వారసులుగా నిలుపుదువు.

ఉత్బా బిన్ షోబా ఆ సమయంలో తన తోటలోనే ఉన్నాడు. అతడు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఆ దీన స్థితిలో చూడగానే బహుశా దూరపు బంధుత్వం వలన లేదా తమ వంశస్థులని భావించినందున లేదా మరే విధముగానైన ప్రభావితం చెంది తన క్రైస్తవసేవకుడైన అద్దాస్‌తో ఒక ద్రాక్ష పండ్లుగల పళ్ళెమును పంపించెను. హుజూర్ (స) ఆ పళ్ళెమును తీసుకోనిన తరువాత నీవు ఎవరవరు? ఎక్కడ ఉంటావు? ఏ ధర్మమును పాటిస్తుంటావు? అని హుజూర్ (స) అద్దాస్‌ను ప్రశ్నించిరి. అందుకు అతడు నేను నైన్వాకు చెందినవాడిని, నేను క్రైస్తవ ధర్మమును పాటించెదను అని సమాధానం ఇచ్చెను. అందుకు హుజూర్ (స) దేవుని స్వచ్ఛమైన దాసుడు యూనుస్ బిన్ మత్తా అవతరించిన నైన్వా ప్రాంతమేనా? అని అడిగిరి. అందుకు అద్దాస్ అవును అని సమాధానం ఇచ్చెను. ఆపై కాని మీకు యూనుస్‌ను గూర్చిన విషయము ఎలా తెలుసునని ప్రశ్నించెను. అందుకు హుజూర్ (స) అతడు నా సోదరుడు. అతడు కూడ దేవుని ప్రవక్త, నేను కూడ దేవుని ప్రవక్తనే అని సమాధానం ఇచ్చి, అతనికి ఇస్లాంను గూర్చి ప్రచారం చేసిరి. ప్రచార ప్రభావం అతనిపై అమితముగా పడడంతో అతడు ముందుకు వచ్చి హుజూర్ (స) చేతిని ముద్దు పెట్టుకొనెను. ఆ దృశ్యమును దూరం నుండి ఉత్బా మరియు షైఅయిబా తిలకించిరి. అద్దాస్ వారి వద్దకు చేరుకోగానే వారు వెంటనే అద్దాస్ నీకు ఏమైంది? నీవు అతని చేతిని ఎందుకు ముద్దు పెట్టుకున్నావు? ఆ వ్యక్తి నిన్ను నీ ధర్మము నుండి వేరుచేయును, నిజానికి అతని ధర్మము కన్న నీ ధర్మమే ఉత్తమమైనదని బుజ్జగించసాగిరి.

**(సీరత్ ఖాతమున్నబియ్యీన్, రచయిత హజ్రత్ మిర్జా బషీరొద్దీన్ ఎం.ఏ రజి గారు. పుట 182, ప్రచురణ 2004)**

అద్దాస్ విశ్వసించిన విశ్వాసభరిత విధానమును తెల్పుచూ హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (ర) ఇలా తెల్పిరి: వారి పదాలలోనే ఈ అంశంను పఠించుము. వారిట్లు తెల్పిరి:

"అద్దీస్ నైన్వా ప్రాంతీయుడు, క్రైస్తవ ధార్మికుడు. అతడు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ముందుకు ద్రాక్ష పండ్లను తీసుకవచ్చినప్పుడు హుజూర్ (స) అపార దయామయుడు, పరమకారుణ్య మూర్తి అల్లాహ్ నామముతో (భుజిస్తున్నాను) అని వాటిని తీసుకొనిరి. (11వ పేజిలో)

# జుమా ప్రసంగము

హ్రజత్ అబూ హురైరహ్ రజి ఇలా ఉల్లేఖించారు: రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖైబర్ యుద్ధం నుండి తిరిగి వస్తున్న క్రమంలో ఒకరాత్రియంతయు ప్రయాణం చేశారు. కాని నిద్ర రావడంతో మార్గ మధ్యలోనే బస చేశారు. ఆ క్రమంలో హుజూర్ (స) హ్రజత్ బిలాల్ రజి తో ఈ రోజు మా నమాజ్‌ను నీవే కాపాడుము అని తెలియజేశారు. హ్రజత్ బిలాల్ రజి ఆ మాటకు అర్థంను ఈ విధముగా తెలిపారు: ఈ మా నమాజ్‌ను నీవే కాపాడుము అనగా నమాజ్ సమయానికి మమ్ము మేల్కొపుము, ఫజర్ నమాజ్ కొరకు మమ్ము మేల్కొపుము.

హ్రజత్ బిలాల్ రజి తరువాత కాలంలో ప్రజలకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కానా ఖాబాలో ఏ చోట నిలబడి నమాజ్ సలిపారు అనే విషయాన్ని తెలియజేశారు. హ్రజత్ ఇబ్నే అబీ ములైకా ఇలా ఉల్లేఖించారు: మక్కాను జయించిన రోజున రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హ్రజత్ బిలాల్ రజిను ఖాబా గృహంపై నిలబడి అజాన్ ఇవ్వమని ఆదేశించారు. అందుకు హ్రజత్ బిలాల్ రజి ఖాబా కప్పుపై నిలబడి అజాన్ ఇచ్చారు.

గత జుమాలో నేను ఒక కథనమును ప్రస్తావించాను. అందులో కూడ ఈ విషయాన్ని ప్రస్తావించడం జరిగింది. ఆ కథనములో ఇలా గలదు. ఆం హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు హ్రజత్ అబూబకర్ రజిలు వారి వారి బంధువుల వలన దాడుల నుండి కాపాడబడేవారు. ఆ కథనాన్ని కూడ విడమర్చి తెలుపడం జరిగింది. ఆ క్రమంలో హ్రజత్ బిలాల్ రజిపై దౌర్జన్యం జరిగింది. హ్రజత్ అబూబకర్ రజిపై దౌర్జన్యం జరిగింది, ఆం హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లంపై కూడ దౌర్జన్యం జరిగిందని పేర్కొనబడింది. వారిపై దౌర్జన్యమే జరుగలేదని ఇక్కడ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ తాలా అన్హు వాదించడం లేదు. వారు రజి ఇక్కడ కేవలం హ్రజత్ బిలాల్ రజిపై జరిగినటు వంటి దౌర్జన్యం ఇతరులపై జరుగలేదు అని మాత్రమే తెలిపారు.

పండుగ రోజు బిలాల్ రజి భర్చీ తీసుకొని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు ముందు ముందు నడిచేవారు. పండుగ రోజు ఒక వ్యక్తి తన చేతిలో భర్చి పట్టుకొని ముందు ముందుగా నడిచేవారు, అధిక శాతం బిలాల్ రజియే భర్చీ తీసుకొని వెళ్ళేవారు. ముహమ్మద్ బిన్ ఉమర్ రజి ఈ విధముగా తెల్పినారు: హ్రజత్ బిలాల్ రజి ఆ భర్చీని ఆం హ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం ముందు నాటేవారు. ఆ కాలంలో బయట ఖాళి మైదానంలో పండుగ నమాజ్ సల్పేవారు. ఖాళి ప్రదేశంలోనే పండుగ నమాజ్ సల్పేవారు.

ఓ బిలాల్! అల్లాహ్ మార్గములో యుద్ధము చేయుట కంటే గొప్ప ప్రార్థన మరొకటి లేదు అని ఒక సందర్భములో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించుచుండగా నేను విన్నాను. అందుకే యుద్ధంలో పాల్గొనాలని భావిస్తున్నాను అని సమాధానం ఇచ్చారు. ఆపై హ్రజత్ బిలాల్ రజి సీరియా వెళ్ళిపోయారు. హ్రజత్ ఉమర్ రజి సీరియా వచ్చినప్పుడు హ్రజత్ ఉమర్ రజి ఆదేశం మేరకు హ్రజత్ బిలాల్ రజి అజాన్ ఇచ్చారు.

హ్రజత్ బిలాల్ రజి సూటిగా మట్లాడే సంఘటన ఒకటి ఇట్లు లభిస్తుంది. అమర్ బిన్ మైమూన్ తన తండ్రి ఆధారంగా ఇట్లు ఉల్లేఖించారు. హ్రజత్ బిలాల్ రజి సోదరుడు తనను తాను అరబ్బుడని చెప్పుకునే వాడు. వారు తమనతాము అరబ్ వంశానికి చెందిన వ్యక్తిననే భావించేవారు. కావున అరబ్‌కు చెందిన ఒక స్త్రీకి, హ్రజత్ బిలాల్ వచ్చినచో మేము నీతో వివాహము కుదుర్చుకుంటాము అని వివాహ సందేశము పంపారు. హ్రజత్ బిలాల్ రజి వచ్చి, తషహ్హుద్ చదివి ఇలా అన్నారు. నేను బిలాల్ బిన్ రబాహ్‌ను. ఇతడు నా సోదరుడు. నా సోదరుడు సత్ప్రవర్తనలు, ధార్మిక పరంగా అంత మంచి వ్యక్తి కాదు. అయినను మీరు ఇతనికిచ్చి వివాహము చేసుకోదలచినచో చేసుకోండి. లేదా ఈ సంబంధాన్ని వదులుకోండి అని సలహ్ ఇచ్చారు. అయినా కూడ వారు వారి సోదరునితో వివాహము కుదుర్చుకున్నారు.

త్యాగములు సమర్పించినప్పుడే గౌరవ స్థానము లభించును. ఆరంభము నుండే విశ్వసనీయతను కనబర్చినవారు ఉన్నత స్థానము పొందుతారని ఇస్లాం గొప్పగా బోధిస్తుంది. ఎబిసీనియా బానిస అయినను లేదా మరో ప్రాంతానికి చెందిన బానిస అయినను ఇస్లాం సూచించిన మేరకు అర్హత ప్రకారము ప్రతి ఒక్కరికి గౌరవం లభించును. ధనికులు లేదా బీదలు అనే వ్యత్యాసముండదు.

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హ్రజత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 18 సెప్టెంబర్ 2020, (18 తబూక్ 1399 హి.ష) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَ رَسُوْلُهٗ

أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔

اِيَّاكَ نَعْبُدُ وَ اِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

గత జుమా నుండి బద్రీ అనుచరులైన హ్రజత్ బిలాల్ బిన్ రబాహ్ రజి ప్రస్తావన కొనసాగుతుంది. మిగిలిన భాగమును నేడు కూడ ప్రస్తావించబడును.

హ్రజత్ అబూ హురైరహ్ రజి ఇలా ఉల్లేఖించారు: రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖైబర్ యుద్ధం నుండి తిరిగి వస్తున్న క్రమంలో ఒకరాత్రియంతయు ప్రయాణం చేశారు. కాని నిద్ర రావడంతో మార్గ మధ్యలోనే బస చేశారు. ఆ క్రమంలో హుజూర్ (స) హ్రజత్ బిలాల్ రజి తో ఈ రోజు మా నమాజ్‌ను నీవే కాపాడుము అని తెలియజేశారు. హ్రజత్ బిలాల్ రజి ఆ మాటకు అర్థంను ఈ విధముగా తెలిపారు: ఈ మా నమాజ్‌ను నీవే కాపాడుము అనగా నమాజ్ సమయానికి మమ్ము మేల్కొపుము, ఫజర్ నమాజ్ కొరకు మమ్ము మేల్కొపుము. మరల హ్రజత్ బిలాల్ రజి ఇలా తెల్పినారు: అల్లాహ్ తాలా నాకు ఆవకాశం కల్పించినంత మేరకే నేను నవాఫిల్ నమాజ్‌లు సల్పినాను. ఆ సమయంలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు అనుచరులు నిద్రిస్తున్నారు. ఫజర్ సమయం సమీపంలో ఉన్నదనగా బిలాల్ రజి తూర్పు దిశకు ముఖమును త్రిప్పి కూర్చున్నారు. అనగా సూర్యుడు ఉదయించు వైపు ముఖము పెట్టి తన ఒంటెను ఆనుకొని కూర్చున్నారు. అలా వారు ఒంటెను ఆనుకొని కూర్చుండి పోయినందున వారికి కూడ నిద్ర పట్టింది. అలా మొత్తానికి హ్రజత్ బిలాల్ రజి మేల్కొనలేదు, అనుచరులలో కూడ ఎవరు మేల్కొనలేదు. చివరికి వారిపై సూర్య కిరణాలు పడసాగాయి. ఫలితముగా అందరి కంటే ముందుగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మేల్కొన్నారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం విచారిస్తూ ఓ బిలాల్ రజి! ఓ బిలాల్ రజి! అని పిలిచారు. అందుకు హ్రజత్ బిలాల్ రజి ఆం రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నా తల్లిదండ్రులు మీకు అంకితం అవుదురు గాకా!, నా ఆత్మను కూడ మీ ఆత్మను పట్టుకున్నటు వంటి శక్తియే పట్టుకున్నది అని సమాధానమిచ్చారు. అనగా నాకు కూడ నిద్ర పట్టింది అని అర్థం. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇక ప్రయాణం ప్రారంభించండి అని ఆదేశించారు. కొద్ది దూరం ప్రయాణం చేశాకా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రయాణంను ఆపి వజూ

చేసుకున్నారు. అలా సూర్యుడు పూర్తిగా బయటికి వచ్చిన కొంత సమయం తరువాత అఖామత్ ఇవ్వమని హజ్రత్ బిలాల్ రజిను సూచించారు. అలా హుజూర్ (స) అందరికి ఫజర్ నమాజ్ చదువించారు. ఆ తరువాత "ఏదేని నమాజ్‌ను చదవడం మర్చిపోయినచో ఆ విషయం గుర్తుకు వచ్చిన వెంటనే చదువవలెను. ఎందుకనగా వైభవోపేతుడు, గౌరవనీయుడైన అల్లాహ్ నన్ను స్మరించుకొనుటకు నమాజ్‌ను స్థిరపర్చుము అని ఆదేశించాడు" అని తెల్పినారు. (సునన్ ఇబ్నే మాజా, కితాబు స్వలాత్, బాబ్ మన్ నామఅ అనిస్వలాత్ వ నసీహా, హదీస్ 697).

మక్కాను జయించినరోజు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కానా ఖాబాలో ప్రవేశించిన సమయంలో హజ్రత్ బిలాల్ రజి కూడ హుజూర్ (స) వెంట ఉన్నారు. హజ్రత్ ఇబ్నే ఉమర్ ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కాను జయించిన రోజున మక్కాలో ప్రవేశించారు. హజ్రత్ ఉస్మాన్ రజియల్లాహ్ తాలా అన్‌హ్ బిన్ తల్హాను పిలిపించారు. వారు వచ్చి కాబా తలుపులు తెరువగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం, హజ్రత్ బిలాల్ రజి, హజ్రత్ ఉసామా బిన్ జైద్ రజి, హజ్రత్ ఉస్మాన్ బిన్ తల్హా రజిలు లోనికి ప్రవేశించారు. ఆ తరువాత తలుపులు మూసి వేయడం జరిగింది. అలా హుజూర్ (స) కొంత సమయం అందులో ఉన్నారు, ఆ తరువాత బయటికి వచ్చారు. హజ్రత్ ఇబ్నే ఉమర్ రజిఈ విధముగా తెలిపారు: నేను త్వరత్వరగా ముందుకు వచ్చి హజ్రత్ బిలాల్ రజిను లోపల ఏమి చేశారు? అని ప్రశ్నించగా, హజ్రత్ బిలాల్ రజి హుజూర్ స నమాజ్ సల్పినారు అని సమాధానం ఇచ్చారు. అనగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కాబాలో నమాజ్ సల్పినారు. అందుకు నేను మరల ఏ చోటు హుజూర్ (స) నమాజ్ సల్పినారు? అని ప్రశ్నించగా, స్థంభాల మధ్యలో అని సమాధాన మిచ్చారు. హజ్రత్ ఇబ్నే ఉమర్ రజి మరల ఇలా తెల్పినారు. హుజూర్ (స) ఎన్ని రకాతులు నమాజ్ సల్పినారో అడిగి తెలుసుకోవడం నేను మర్చిపోయాను. (సహి బుఖారి, కితాబుస్వలాత్, బాబ్ అబ్వాబుల్ ఘలఖల్ కఅబతు వల్ మసాజిద్, హదీస్ 468).

హజ్రత్ బిలాల్ రజి తరువాత కాలంలో ప్రజలకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కానా ఖాబాలో ఏ చోట నిలబడి నమాజ్ సలిపారు అనే విషయాన్ని తెలియజేశారు. హజ్రత్ ఇబ్నే అబీ ములైకా ఇలా ఉల్లేఖించారు: మక్కాను జయించిన రోజున రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ బిలాల్ రజిను ఖాబా గృహంపై నిలబడి అజాన్ ఇవ్వమని ఆదేశించారు. అందుకు హజ్రత్ బిలాల్ రజి ఖాబా కప్పుపై నిలబడి అజాన్ ఇచ్చారు. (అత్తబ్ఖాతుల్ కుబ్రా లి ఇబ్నే సఅద్, సంపుటి 3, పుట 177, బిలాల్ బినఅ రబాహ్, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 2017).

హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజియల్లాహు తాలా అన్‌హ్ మక్కాను జయించిన రోజు హజ్రత్ బిలాల్ రజి స్థితిగతులను గూర్చి ఈ విధముగా తెలియజేశారు: హజ్రత్ అబ్బాస్ రజియల్లాహ్ తాలా అన్‌హు అబూసుఫ్యాన్‌ను తీసుకొని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సమావేశానికి వచ్చారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అబూసుఫ్యాన్ చూసి నీ పరిస్థితిని చూసినచో చాలా దయ నీయముగా కనిపిస్తుంది, ఇంకా దేవుడు ఒక్కడే ఉన్నాడనే నమ్మకం నీకు కలుగలేదా? అని అన్నారు. అందుకు అబూసుఫ్యాన్ ఎందుకు నమ్మకం కలుగలేదు? కల్గింది. ఒకవేళ రెండవ దేవుడు ఉన్నచో తప్పకుండా మాకు సహాయం చేసేవాడు అని సమాధానం ఇచ్చాడు. మరల హుజూర్ (స) నీ పరిస్థితి ఇంకా దయనీయముగా కనిపిస్తుంది. ముహమ్మద్ దేవుని సందేశహరుడనే నమ్మకం నీకు ఇంకా కలుగలేదా? అని ప్రశ్నించగా, అందుకు అతడు ఈ విషయంలో ఇంకా నమ్మకం కలుగలేదని సమాధానం ఇచ్చాడు. హజ్రత్ అబ్బాస్ రజి అబూసుఫ్యాన్‌తో ఓ మూర్ఖుడా! ఇకనైన బైఅత్ చేయుము. ఫలితముగా నీ ప్రాణాలు, నీ జాతి ప్రాణాలైన మిగులుతాయి అని సలహా ఇచ్చారు. అందుకు అబూసుఫ్యాన్ అలా అయినచో సరే నేను బైఅత్ చేస్తాను అని ముందుకు వచ్చాడు. అప్పుడు అబూసుఫ్యాన్ వారి సలహా మేరకు నామ మాత్రముగానే బైఅత్ చేశాడు కాని మనస్ఫూర్తిగా బైఅత్ చేయలేదు. కాని తరువాత కాలంలో స్వచ్ఛమైన ముస్లింగా మారిపోయాడు. మొత్తానికి అబూసుఫ్యాన్ బైఅత్ చేసిన తరువాత హజ్రత్ అబ్బాస్ రజి నీకు ఏమి కావాలో కోరుకో లేనిచో నీ జాతి మొత్తం నాశనమం చేయబడుతుంది అని మరల సలహా ఇచ్చారు. ఆ సమయంలో ముహాజిర్ల (వలసవాదుల) గుండెలు భయాందోళనతో వేగంగా కొట్టుకోసాగాయి. ఎందుకనగా వారు కూడ మక్కా వాస్తవ్యులు. పైగా ఒక్కసారి మక్కా నగర గౌరవం మంట గలసినచో మరల మక్కా నగరానికి గౌరవం దక్కదనే విషయాన్ని వారు అర్థం చేసుకున్నారు. అందుకే భరించరాని ఎన్నో బాధలను భరించినప్పటికి మనస్సులో మాత్రం ఏదో ఒక విధముగా సంధి కుదుర్చుకోవాలని దుఆలు చేస్తున్నారు. కాని అన్సార్ మాత్రం చాలా ఆవేశంతో ఉన్నారు. అప్పుడు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఏమి కోరుకుంటావో కోరుకో అని అనుమతినిచ్చారు. అందుకు అబూసుఫ్యాన్ ఓ రసూలుల్లాహ్ ! సల్లల్లాహు అలైహి వసల్లం మీరు మీ జాతిపై కనికరంను చూపలేరా?. మీరు సల్లల్లాహు అలైహి వసల్లం చాలా కరుణామయులు కదా!. పైగా నేను మీ బంధువును, మీకు సోదరుడిని అవుతాను. నేను ముసల్మానుడిని అయినందునా నాకు కూడ ఒక ప్రత్యేకత ఉండాలి కదా?. అందుకు హుజూర్ (స) అలా అయినచో వెళ్ళుము, మక్కాలో పర్యటిస్తూ ఎవరైతే అబూసుఫ్యాన్ ఇంట్లోకి ప్రవేశించెదరో వారికి రక్షణ కల్పించబడును అని చాటి చెప్పుము అని అనుమతినిచ్చారు. అందుకు అబూసుఫ్యాన్ ఓ రసూలుల్లాహ్! నా ఇల్లు ఎంత ఉన్నది?, అందులో ఎంత మంది ఉండ గలరు?. ఇంత పెద్ద నగరానికి నా ఇల్లు ఏమి సరిపోతుంది? అని విన్నవించుకున్నారు. అందుకు హుజూర్ (స) అలా అయినచో ఎవరైతే కానా ఖాబా ప్రాంగణంలోకి చేరుకుంటారో వారికి కూడ రక్షణ కల్పించబడును అని చాటుము అని ఆదేశించారు. అందుకు అబూసుఫ్యాన్ మరల ఓ రసూలుల్లాహ్! అయినా కూడ ప్రజలు మిగిలిపోతారు అని విన్నవించుకున్నారు. అందుకు హుజూర్ (స) అలా అయినచో ఎవరైతే ఆయుధాలను పడవేస్తారో వారికి కూడ రక్షణ కల్పించబడును అని అనుమతిని ఇచ్చారు. అందుకు అబూసుఫ్యాన్ ఓ రసూలుల్లాహ్! అయినా కూడ ప్రజలు మిగిలిపోతారు అని విన్నవించుకున్నాడు. అందుకు హుజూర్ (స) అలా అయినచో ఎవరైతే తమ ఇంటి తలుపులను మూసుకుంటారో వారికి కూడ రక్షణ కల్పించబడును అని తెలిపారు. అందుకు అబూసుఫ్యాన్ ఓ రసూలుల్లాహ్! అలా అయినచో మరి ఇండ్లు లేని వారు, వీధులలో ఉండేవారు మరణిస్తారు కదా! అని విన్నవించుకున్నాడు. అప్పుడు హుజూర్ స ఇదికూడ చాలా మంచి ఆలోచనయే, అలా అయినచో రండి బిలాల్ రజిపేరుతో ఒక పతాకమును సిద్ధం చేద్దాం, అబి రువైహ రజియల్లాహ్ తాలా అన్‌హు అనే పేరుగల ఒక అనుచరుడు ఉన్నారు. హుజూర్ (స) మదీనా చేరుకున్న తరువాత ముహాజిర్లకు అన్సార్‌ల మధ్య సోదరత్వంను ఏర్పర్చినప్పుడు అబీ రువైహ రజి ను హజ్రత్ బిలాల్ రజికు సోదరుడిగా ప్రకటించారు. బహుశా ఆ సమయంలో అక్కడ బిలాల్ రజి లేకపోవచ్చును. లేదా ఏదేని ముఖ్యమైన పనికి పంపి ఉండవచ్చును. మొత్తానికి హుజూర్ (స) బిలాల్ రజి జండాను సిద్ధం చేశారు. ఆ జండాను అబీ రువైహ రజికు అప్పగిస్తూ, ఇది బిలాల్ రజి జండా, దీనిని తీసుకొని నీవు కూడలిలో నిలబడుము. ఆపై ఎవరైతే బిలాల్ పతాకము క్రింద ప్రోగు అవుతారో వారందరు కాపాడబడుతారు అని ప్రకటన చేయుము అని ఆదేశించారు. అప్పుడు అబూసుఫ్యాన్ ఇక చాలు, మక్కా వారందరు రక్షించబడుతారు అని శ్వాస తీసుకున్నారు. ఆపై ఇక నేను వెళ్ళుటకు అనుమతించుము అని విన్నవించుకున్నారు. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం వెళ్ళుటకు అనుమతినిచ్చారు. ఇప్పుడు నాయకుడే ఆయుధాలను వదిలివేశాడు అనగా లొంగిపోయాడు. ఈ వార్త ప్రజలకు చేరుతుందా? చేరదా? అనే ప్రశ్నే లేదు. మొత్తానికి అబూసుఫ్యాన్ భయపడుతూ మక్కా నగరంలోకి ప్రవేశించాడు.

ఆపై ఇలా ప్రకటించసాగాడు. ప్రజలారా! మీరు మీ ఇళ్ళలోకి చేరుకొని తలుపులు పెట్టుకోండి, ప్రజలారా! మీ ఆయుధాలను పడవేయండి, ప్రజలారా! కానా ఖాబా ప్రాంగణంలోకి వెళ్ళండి, ప్రజలారా! బిలాల్ రజి యొక్క జండా ఎగరవేయడం జరిగింది, కావున దాని క్రింద కూడ ఏకంకండి. అలా ప్రకటన చేసుండగానే ప్రజలు ఇళ్ళలోకి చేరుకొని తలుపులు మూసుకోసాగారు, మరి కొందరు కానా ఖాబా ప్రాంగణంలోకి చేరుకోసాగారు, మరి కొందరు తమ ఆయుధాలను బయటికి తీసుకవచ్చి పారవేయడం ప్రారంభించారు. అప్పటికే ఇస్లామీయ సైన్యం మక్కా నగరంలోకి ప్రవేశించినది. మరి కొందరు బిలాల్ రజి జండా క్రింద ఏకమైయ్యారు. ఈ పూర్తి ఘటనలో అన్నిటి కంటే గొప్ప ఘటన హజ్రత్ బిలాల్ రజి జండా స్థాపించు ఘటనయే అని హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ రజి తెలిపారు. వారు రజి ఇలా తెల్పినారు: రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బిలాల్ రజిజండాను సిద్ధం చేశారు. ఆపై బిలాల్ రజి జండా క్రింద ఏకమైన వారికి రక్షణ కల్పించబడును అని కూడ ప్రకటించడం జరుగుతుంది. వాస్తవానికి ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారే నాయకులు. అయినా కూడ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి పేరుపై ఎలాంటి జండా తయారు చేయబడదు. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత త్యాగాలు చేయుటకు ముందంజ లో ఉన్నవారు హజ్రత్ అబూబకర్ రజిగారు. వారి పేరు మీద కూడ ఎలాంటి జండాను సిద్ధం చేయలేదు. వారి తరువాత ఇస్లాంను స్వీకరించిన ధనవంతులు హజ్రత్ ఉమర్ రజిగారు. అయినా కూడ హజ్రత్ ఉమర్ రజిపేరుపై ఎలాంటి జండాను ఏర్పాటు చేయలేదు. వారి తరువాత హజ్రత్ ఉస్మాన్ రజి గారు ఉన్నారు, పైగా వారు హుజూర్ (స) గారి అల్లుడు కూడ. అయినా కూడ ఉస్మాన్ రజి పేరు మీద జండాను ఏర్పాటు చేయలేదు. వారి తరువాత హజ్రత్ అలీ రజి గారు ఉన్నారు, పైగా వారు హుజూర్ (స)కు సోదరుడు అవుతారు, మరోవైపు అల్లుడు కూడ. అయినా కూడ అలీ రజిపేరు మీద ఎలాంటి జండాను ఏర్పాటు చేయలేదు. వారి తరువాత హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ రజి గారు ఉన్నారు. వీరిని గూర్చి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ వ్యక్తి ఉన్నంత కాలం ముసల్మానులలో ఎలాంటి విభేదాలు ఏర్పడవు అని కూడ తెల్పినారు. అయినా కూడ హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ రజిపేరు మీద కూడ ఎలాంటి జండాను ఏర్పాటు చేయలేదు. వారి తరువాత హజ్రత్ అబ్బాస్ రజియల్లాహు తాలా అన్హు కూడ ఉన్నారు. పైగా వారు హుజూర్ (స) గారికి పిన్నాన్న అవుతారు. కొన్ని సందర్భాలలో వీరు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ముందు కఠినముగా మాట్లాడిన కూడ హుజూర్ (స) వీరిని ఏమి అనేవారు కాదు. అయినా కూడ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వీరి పేరు మీద కూడ ఎలాంటి జండాను ఏర్పాటు చేయలేదు. వీరే గాకుండా గొప్పగొప్ప నాయకులు, ప్రముఖ అనుచరులు కూడ ఉన్నారు. ఒక ప్రముఖ నాయకుడి కుమారుడు మరియు స్వీయ ప్రఖ్యాతిని కల్గిన ఖాలిద్ బిన్ వలీద్ రజి కూడ ఉన్నారు, అదే విధముగా మరొక నాయకుడి కుమారుడు అమర్ బిన్ ఆస్ రజి కూడ ఉన్నారు. ఇలా అనేక మంది ప్రముఖ నాయకుల కుమారులు, వీరులు కూడ ఉన్నారు. అయినా కూడ వీరిలో ఏ ఒక్కరి పేరు మీద జండాను ఏర్పాటు చేయలేదు. ఒకవేళ జండాను ఏర్పాటు చేసినచో కేవలం హజ్రత్ బిలాల్ రజి పేరుపై మాత్రమే జండాను ఏర్పాటు చేయడం జరిగింది. అలా ఎందుకు?, ఏ కారణం చేత ఏర్పాటు చేయడం జరిగింది? చూద్దాం. అందుకు కారణం ఏమిటనగా, మక్కాపై యుద్ధం చేయుటకు ముందుకు కదిలినప్పుడు ఎవరితోనైతే యుద్ధం చేయుచున్నరో వారు తమ సోదరులు, బంధువు మిత్రులు అనే విషయాన్ని అబూబకర్ రజి గ్రహించాడు. ఒక సందర్భములో వారే స్వయముగా ఈ విధముగా అన్నారు. ఓ రసూలుల్లాహ్! ఇప్పుడు మా సోదరులనే హతమార్చవలెనా?, వారు ఆ దౌర్జన్యాలన్నింటిని మర్చిపోయారు, మక్కా వాసులు తమ సోదరులే అనే విషయాన్ని వారు గ్రహించారు. ఒకవేళ ఉమర్ రజి విన్న వించుకున్నచో ఓ రసూలుల్లాహ్! సల్లల్లాహు అలైహి వసల్లం ఈ అవిశ్వాసులను హతమార్చుము అని విన్నవించుకునే వారు కావచ్చును. కాని హుజూర్ (స) వారిని క్షమించినప్పుడు హజ్రత్ ఉమర్ రజి తమ మనస్సులో మంచింది, నా సోదరులు మన్నించబడ్డారు అని సంతోష పడేవారు. ఉస్మాన్ రజి మరియు అలీ రజిలు కూడ మా సోదరులు క్షమించబడ్డారు, వారు మాతో కఠినముగా వ్యవహరించినంత మాత్రాన ఏమైంది? అని సంతోషించేవారు కావచ్చును. స్వయముగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు కూడ క్షమించినప్పుడు వారిలో నా పిన్నాన్నలు ఉన్నారు, వారి కుమారులు ఉన్నారు. వారిలో కొందరు నా సమీప బంధువు మిత్రువులు, వరుసకు అల్లులు అయ్యేవారు కూడ ఉన్నారు. కావున నేను వారిని క్షమించినచో వారికి మంచియే జరుగును కదా! నా బంధువు మిత్రువులు కూడ క్షమించబడ్డారు. అని ఆలోచించి ఉండవచ్చును. కాని వారందరిలో కేవలం ఒకే ఒక వ్యక్తి మిగిలి ఉన్నారు. వారికి మక్కా వాసులకు ఎలాంటి సంబంధం లేదు. వారికి మక్కాలో ఎలాంటి అధికారము కూడ లేదు. వారికి మక్కాలో స్నేహితులు కూడ ఎవరు లేరు. వారి నిస్సహాయ స్థితిలో ఉన్నప్పుడు వారిపై దౌర్జన్యం్య చేయడం జరిగింది. అలాంటి దౌర్జన్యం అబూబకర్ రజిపై గాని, అలీ రజిపైగాని, ఉస్మాన్ రజి పైగాని, ఉమర్ రజి పైగాని చివరికి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంపై గాని జరగలేదు.

గత జుమాలో నేను ఒక కథనమును ప్రస్తావించాను. అందులో కూడ ఈ విషయాన్ని ప్రస్తావించడం జరిగింది. ఆ కథనములో ఇలా గలదు. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మరియు హజ్రత్ అబూబకర్ రజిలు వారి వారి బంధువుల వలన దాడుల నుండి కాపాడబడేవారు. ఆ కథనాన్ని కూడ విడమర్చి తెలుపడం జరిగింది. ఆ క్రమంలో హజ్రత్ బిలాల్ రజిపై దౌర్జన్యం జరిగింది. హజ్రత్ అబూబకర్ రజిపై దౌర్జన్యం జరిగింది, ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంపై కూడ దౌర్జన్యం జరిగిందని పేర్కొనబడింది. వారిపై దౌర్జన్యమే జరుగలేదని ఇక్కడ ముస్లేహ్ మౌవూద్ రజియల్లాహ్ తాలా అన్హు వాదించడం లేదు. వారు రజి ఇక్కడ కేవలం హజ్రత్ బిలాల్ రజిపై జరిగినటు వంటి దౌర్జన్యం ఇతరులపై జరుగలేదు అని మాత్రమే తెలిపారు.

మరల వారు రజి ఆ విషయాన్ని వివరముగా ఈ విధముగా తెలియజేశారు: ఏ విధముగా దౌర్జన్యం చేయబడ్డారు?, ఏ విధముగా అనగా, కాలుతున్నటువంటి ఇసుకలో హజ్రత్ బిలాల్రజిను బట్టలు లేకుండా పడుకోబెట్టేవారు. మే మరియు జూన్ మాసాలలో చెప్పులు లేకుండా నడవలేరు. ఈ విషయం అందరికి తెలుసు. అలాంటి ఎండాకాలంలో వారిని బట్టలు లేకుండ ఇసుకపై పడుకోబెడుతారు. ఆపై యువకులు మొనలు ఉన్నటు వంటి బూట్లు వేసుకొని వారి యదపై దూకుతుంటారు. అంతేగాకా అల్లాహ్ కాకుండా ఇతర దైవాలు కూడ ఉన్నాయి అని స్వీకరించుమని, ముహమ్మద్ రసూలుల్లాహ్ అసత్యవంతుడని పలుకుము అని ఒత్తిడి చేస్తారు. కాని హజ్రత్ బిలాల్ రజి ఒకవైపు కొట్టబడుతూనే మరోవైపు తన నిగ్రోజాతి భాషలో అష్హదు అన్ లా ఇలాహా ఇల్లల్లాహ్, అష్హదు అన్ లా ఇలాహా ఇల్లల్లాహ్ అని పలుకేవారు. ఆ వ్యక్తి ఎదుటివారితో నీవు నాపై ఎంత దౌర్జన్యం చేసినను నేను దేవుడు ఒక్కడే అని తెలుసుకున్న తరువాత ఇద్దరు ఉన్నారని ఎలా అంగీకరించగలను?, అంతేగాకుండా హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సత్యవంతులని గ్రహించిన తరువాత వారు అసత్యులని నేను ఎలా పలుకగలను? అని సమాధానం ఇచ్చేవాడు. అందుకు ఆ దుష్టులు వారిని అధికముగా హింసించేవారు. వేసవి కాలపు మాసాలు. అంతటి వేసవి కాలపు మాసాలలో అంతటి ఎండలలో వారితో అవిశ్వాసులు ఇలా వ్యవహరించేవారు. అదే విధముగా చలి కాలంలో వారి కాళ్ళకు త్రాడు కట్టి మక్కా నగరపు వీధులలో వారిని రాళ్ళపై నుండి లాగుకెళ్ళేవారు. ఫలితముగా వారి చర్మం ఊడిపోయేది, శరీరం గాయపడేది. అనగా వారు లాగుకెళ్ళినందున వారి చర్మం ఊడి అక్కడ గాయాలయ్యేవి. అలా లాగుకెళ్తూ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అసత్యుడు, అల్లాహ్ కాకుండా ఇతర దైవాలు ఉ

న్నాయి అని పలుకుము అని హింసించేవారు. కాని బిలాల్ రజిమాత్రం అష్హదు అన్ లా ఇలాహా ఇల్లల్లాహ్, అష్హదు అన్ లా ఇలాహా ఇల్లల్లాహ్ అని మాత్రమే పలుకేవారు.

ఇస్లాం యొక్క సైన్యం 10వేల మంది సైనికులతో మక్కాలో ప్రవేశించుటకు రాగానే హజ్రత్ బిలాల్ రజి మనస్సులో ఈ రోజు నాయదపై బూట్లతో ఎగిరిన వారిపై ప్రతీకారం తీర్చుకోవచ్చును అనే ఆలోచన కల్గి ఉండవచ్చును. అంతేగాకుండా నన్ను హింసించిన వారి హింసకు ప్రతీకారం తీర్చుకునే అవకాశం కూడ వస్తుందని భావించి ఉండవచ్చును. కాని ఎవరైతే అబూసుఫ్యాన్ ఇంట్లో ఉంటారో వారు క్షమించబడుదురు, ఎవరైతే కానా ఖాబా ప్రాంగణంలోకి ప్రవేశిస్తారో వారు కూడ క్షమించబడుతారు, ఎవరైతే ఆయుధాలను పడవేస్తారో వారు కూడ క్షమించబడుతారు, ఎవరైతే తమ తమ ఇళ్ళలో ఉండి తలుపులు వేసుకుంటారో వారు కూడ క్షమించబడుతారు అని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రకటించినప్పుడు హజ్రత్ బిలాల్ రజి మనస్సులో వీరందరు తమ సోదరులను క్షమించి వేస్తున్నారు, ఇది మంచి పనియే, కాని నేను ఎలా ప్రతీకారం తీర్చుకునేది? అనే ఆలోచన కల్గి ఉండవచ్చును. నేను ఇలా అందరిని క్షమించడం వలన ఈ రోజు కేవలం ఒక వ్యక్తికే బాధ కల్గుతుంది అనే విషయాన్ని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గుర్తించారు. ఆ వ్యక్తి బిలాల్ రజి. నేను క్షమించిన వారందరిలో ఎవరు కూడ వారికి సోదరులు కారు. వారిని గురి చేసినంత చిత్రహింసలకు మరెవరిని కూడ గురి చేయబడలేదు. హుజూర్ (స) ఇలా తెల్పినారు: అందుకు ప్రతీకారం తీర్చుకోవాలి. నా ప్రవక్తుత్వ వైభవము కూడ కొనసాగాలి, ఆపై బిలాల్ రజి మనస్సు కూడ ఆనందంతో నిండి పోవాలి. అందుకే హుజూర్ (స) బిలాల్ రజి జండాను ఏర్పాటు చేయమని ఆదేశించారు. ఆపై మక్కా నాయకులలో ఎవరైతే బూట్లు వేసుకొని బిలాల్ రజి యదను త్రొక్కినారో, ఎవరైతే బిలాల్ రజి కాళ్ళకు త్రాడు కట్టి వీధులలో లాగుకెళ్ళేవారో, ఎవరైతే బిలాల్ రజిను కాలుతున్న ఇసుకలో బట్టలు లేకుండా పడుకోబెట్టి వారి యదపై బండరాళ్ళను పెట్టారో వారందరికి ఒకవేళ మీరు, మీ భార్య పిల్లలు ప్రాణాలతో ఉండాలని భావించుకున్నచో బిలాల్ రజి జండా క్రిందికి రమ్మని పిలుపునివ్వడం జరిగింది. బహుశా ఈ ప్రపంచం ప్రారంభమైన నాటి నుండి, మానవునికి అధికారం లభించిన నాటి నుండి, ఒక మానవునికి మరో మానవునిపై ప్రతీకారం తీర్చుకునే అవకాశం, అధికారం లభించినప్పటి నుండి ఇంత గొప్పగా, వైభవంగా ప్రతీకారం తీర్చుకున్న ఉదాహరణలు ఎక్కడ కనిపించవు. బిలాల్ రజి జండాను కానా ఖాబా ప్రాంగణం ముందు నాటినప్పుడు అరబ్‌కు చెందిన నాయకులు బిలాల్ రజిను తమ కాళ్ళతో త్రొక్కిన వారు, ముహమ్మద్ రసూలుల్లాహ్ అసత్యుడు అని పలకమని హింసించిన వారు, పరిస్థితులు తలక్రిందులైన తరువాత, తమను తమ భార్య పిల్లలను కాపాడుకోవడం కోసం ఒక్కొక్కరిని పట్టుకొని పరుగులు తీస్తూ బిలాల్ రజి జండా క్రిందికి రావడంను చూసి ఆ సమయంలో హజ్రత్ బిలాల్ రజి మనస్సు ఎంతలా సంతోషించినదో, తమ ప్రాణాలను కృతజ్ఞత పూర్వకముగా ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పై ఎలా అర్పించుకోవాలనుకున్నారో ఆలోచించి ఉండవచ్చును. మరల ఇలా ఆలోచించవచ్చును. ఆ అవిశ్వాసులతో ప్రతీకారం ఎలా తీర్చుకోవాలి? అసలు తీసుకోవాలా? తీసుకోకూడదా? కూడ నాకు తెలియదు. కాని ఇప్పుడు ప్రతీకారం తీర్చుకోవడం జరిగింది. నా యదపై దూకిన ప్రతి ఒక్క బూటు కాలు వ్యక్తి తలను ఇప్పుడు నా బూటు కాలు ముందు వంచడం జరిగింది. ఇది ఎంత గొప్ప ప్రతీకారము అనగా ఎవరి బూట్లు అయితే వారి యదపై ఎగిరి పడ్డాయో ఆ బూట్లు వేసుకున్న ప్రతి ఒక్కరి తల బిలాల్ రజి బూటు కాలి ముందు వంచవలసి వచ్చింది. ఈ ప్రతీకారం యూసూఫ్ అలైహిస్సలాం ప్రతీకారం కన్న గొప్పది. అలా ఎందుకనగా యూసూఫ్ అ తన తండ్రి కొరకు వారి సోదరులను క్షమించి వేశారు. అక్కడ క్షమించడానికి కారణం వారి తండ్రి గారు. ఎవరినైతే క్షమించడం జరిగిందో వారు వారి సోదరులు. హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కూడ తమ పిన్నాన్నలను, వారి కుమారులను ఒక సేవకుని బూట్ల కొరకు క్షమించివేశారు. అలాంటప్పుడు ఈ ప్రతీకారం ముందు యూసూఫ్ అ ప్రతీకారం ఎంతది?. (సేరే రూహానీ, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 24, పుట 268-273).

పైన పేర్కొనబడిన విషయం సేరే రూహానీ నుండి సేకరించడం జరిగింది. ఇదే విషయాన్ని దిబాచ తఫ్సీరుల్ ఖుర్ఆన్‌లో ఈ విధముగా సంక్షిప్తముగా పేర్కొనడం జరిగింది. ఈ విషయాన్ని నేను ఎందుకు తెల్పుచున్నాననగా కొందరు ఫలాన చోట ఈ విధముగా వ్రాసి ఉన్నది అని నాకు లేఖలు వ్రాస్తుంటారు. కావున ఈ రెండు చోట్ల ఒకటి వివరముగా ఉన్నది, మరొకటి సంక్షిప్తముగా ఉన్నది. అంతకు మించి మరే వ్యత్యాసం లేదు. కొందరు వ్యక్తులు చాలా సూక్ష్మదృష్టితో చూస్తూ లోపాలను వెలికితీస్తుంటారు. కాని ఘటన రీత్య, ఫలితము రీత్య రెండు ఒకటే.

మొత్తానికి దిబాచలో ఈ విధముగా పేర్కొనడం జరిగింది. అబూసుఫ్యాన్ ఈ విధముగా అభ్యర్థించాడు. ఓ రసూలుల్లాహ్! సల్లల్లాహు అలైహి వసల్లం ఒకవేళ మక్కావారు ఆయుధాలు ఎత్తనిచో సురక్షితముగా ఉండగలరా?. అందుకు హుజూర్ (స) అవును అని సమాధానం ఇచ్చారు. అంతేగాకా తమ ఇళ్ళలో ఉండి తలుపులు మూసుకున్న వారు కూడ సురక్షితముగా ఉంటారు అని కూడ చెప్పారు. అప్పుడు హజ్రత్ అబ్బాస్ రజి ఓ రసూలుల్లాహ్! స అబూ సుఫ్యాన్ ప్రగల్భాలకు వెళ్ళునట్టి మనిషి అని విన్నవించుకున్నారు. దీని అర్థమేమనగా అబూసుఫ్యాన్ తన గౌరవార్థం కూడ ఏదైన ఉపాయంను కోరుకుంటున్నారు. ఇక్కడ హజ్రత్ అబ్బాస్ రజి ను గూర్చి ఒక వాఖ్యము ఎక్కువగా చెప్పడం జరిగింది. అందుకు హుజూర్ (స) అలా అయినచో మంచిది. ఎవరైతే అబూసుఫ్యాన్ ఇంటిలోకి ప్రవేశించుదురో వారు కూడ సురక్షితముగా ఉంటారు, ఎవరైతే కానా ఖాబా ప్రాంగణంలోకి వెళ్ళుతారో వారు కూడ సురక్షితముగా ఉంటారు. ఎవరైతే ఆయుధాలను పడవేస్తారో వారు కూడ సురక్షితముగా ఉంటారు, ఎవరైతే తమ ఇంటి తలుపులను మూసుకొని ఇంట్లో కూర్చుంటారో వారు కూడ సురక్షితముగా ఉంటారు, ఎవరైతే హకీం బిన్ హజామ్ రజి ఇంట్లో ఉంటారో వారు కూడ సురక్షితముగా ఉంటారు అని తెల్పినారు. ఆ తరువాత హజ్రత్ బిలాల్ రజికు సోదరుడిని చేసినటు వంటి అబీ రువైహకు హుజూర్ (స) ఒక జండాను పట్టుకొమ్మని ఇచ్చారు. ఆపై ఎవరైతే అబీ రువైహ జండా క్రిందికి వస్తారో వారు కూడ సురక్షితముగా ఉంటారు అని ప్రకటించడం జరిగింది. అంతేగాకా బిలాల్ రజిను కూడ ఆ జెండాతో పాటు నడుస్తూ ఎవరైతే అబీ రువైహ పట్టుకున్న జండా క్రిందికి వస్తారో వారు కూడ సురక్షితముగా ఉంటారు అని ప్రకటన చేయమని కూడ సూచించడం జరిగింది. బిలాల్ రజి ప్రకటన చేస్తూ వారితో వెళ్ళడం అనేది ఇక్కడ అధిక వాఖ్యం. ఈ ఆదేశంలో ఎంత గొప్ప విజ్ఞత ఉన్నదో చూడండి. మక్కా ప్రజలు బిలాల్ రజికాళ్ళకు త్రాడు కట్టి మక్కా వీధులలో లాక్కెళ్ళేవారు. మక్కా నగరపు వీధులు, మక్కా నగరపు మైదానాలు బిలాల్ కొరకు సురక్షితముగా లేకుండెను. హింసించబడుటకు, అవమానించబడుటకు, హేళన చేబడుటకు మాత్రమే అనుకూలముగా ఉండేవి. ఈ రోజు ప్రతీకారం తీర్చుకోవాలనే ఆలోచన బిలాల్ రజి మనస్సులో పదే పదే కలుగవచ్చును. అంతటి విధేయుడి ప్రతీకారం తీర్చడం కూడ తప్పనిసరియే. కాని మనం తీసుకునే ప్రతీకారం ఇస్లాం వైభవానికి అనుగుణముగా ఉండాలి. అందుకే హుజూర్ (స) ఖడ్గాన్ని చేతపట్టుకొని శత్రువుల తలలు నరుకుతూ బిలాల్ రజి ప్రతీకారం తీర్చుకోలేదు. వారి సోదరుడి చేతికి ఒక జెండాను ఇచ్చి నిలబెట్టారు. నా సోదరుడి జండా క్రింద నిలబడు వారు కూడ కాపాడబడుతారు అని ఎలుగెత్తి చాటుటకు బిలాల్ రజిను నియమించడం జరిగింది. ఇది ఎంత గొప్ప ప్రతీకారం, ఎంతటి సుందరమైన ప్రతీకారం ఇది. బిలాల్ రజిగట్టిగా మక్కా వారితో ఓ మక్కా

ప్రజలారా! మీరు నా సోదరుడు పట్టుకున్న జండా క్రిందికి వచ్చినచో మీరు కాపాడబడుతారు అని ప్రకటన చేస్తుండగా స్వయముగా వారి మనస్సు కూడ ప్రతీకారం తీర్చుకోవాలనే కోరికను మర్చిపోయి ఉండవచ్చును. పైగా నా తరుపున ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రతీకారం తీర్చుకొనుటకు ఎంచుకున్న విధానం కూడ ఎంతో అద్భుతం, అమోఘం. ఇంతకు మించిన ప్రతీకారం మరొకటి ఉండదని కూడ సంతృప్తి చెందవచ్చును. (దిబాచ తఫ్సీరుల్ ఖుర్ఆన్, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 20, పుట 340-341).

మరల హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజియల్లాహ్ తాలా అన్‌హు హజ్రత్ బిలాల్ రజిగారి సహనంను గూర్చి, మక్కా విజయపు రోజున వారి పరిస్థితిని గూర్చితెల్పుచూ ఇలా వ్రాసారు: బిలాల్ రజిను ఈ క్రింది విధముగా బాధించడం జరిగింది. మక్కాలో వారు ఎదుర్కొన్న బాధలను గూర్చి ముందే తెలుపడం జరిగింది. కాని మక్కా విజయపు రోజున రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం బిలాల్ రజికు ఎంతటి గౌరవాన్ని చేకూర్చినారో మీకు తెలుసా?. ఏ విధముగా వారి తరుపున ప్రతీకారం తీర్చుకున్నారో మీకు తెలుసా?. మక్కా నాయకులు మక్కాలో నిగ్రోజాతికి చెందిన బానిసలలో ఒకరైన హజ్రత్ బిలాల్ రజి యదపై బూట్లతో దూకేవారు. అలాంటి బిలాల్ రజి చేతికి ఒక జెండాను ఇచ్చి ఓ మక్కా నాయకులారా! మీరు మీ ప్రాణాలను కాపాడుకోదలచినచో బిలాల్ రజి జండా క్రిందికి వచ్చి నిలబడండి అని ప్రకటించడం జరిగింది. మక్కాకు చెందిన పెద్ద పెద్ద నాయకులు బిలాల్ రజి యదపై ఎగిరి దూకేవారు. అట్టి బిలాల్ రజిను గూర్చి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ విధముగా తెల్పినారు. ఓ మక్కా ప్రజలారా! ఈ రోజు మీరు మీ ప్రాణాలను కాపాడుకోదలచినచో ఒకటే మార్గం గలదు. ఆ మార్గం ఏమిటనగా మీరు బిలాల్ రజికు సేవకులుగా మారుము. వాస్తవానికి బిలాల్ రజి ఒక బానిస. మక్కా ప్రజలు గౌరవ వంశస్తులు. (ఆయిందా వహి ఖౌమ్ ఇజ్జత్ పాయేంగే జో మాలి వ జాని ఖుర్బానియోం మే హిస్సా లేంగి, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 21, పుట 164).

మొత్తానికి అన్ని కథనాలలో ఒకే సారాంశం గలదు. ఒకవేళ వారి సోదరుడి చేతికి జండా ఇచ్చినను అప్పుడు కూడ బిలాల్ రజిను ఆ జండాకు తోడుగా పంపడం జరిగింది. బిలాల్ రజిపేరున జండాను ఏర్పాటు చేసి వారికి జండా అప్పగించినను ఫలితము ఒకే విధముగా వెలువడును. కొద్ది తేడాతో కథనాలను ప్రస్తావించడం జరిగింది. ఫలితము కూడ పైన పేర్కొనట్లుగానే వెలువడుతుంది.

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ రజి ఇలా ఉల్లేఖించారు. పండుగ రోజు బిలాల్ రజి భర్చీ తీసుకొని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు ముందు ముందు నడిచేవారు. పండుగ రోజు ఒక వ్యక్తి తన చేతిలో భర్చి పట్టుకొని ముందు ముందుగా నడిచేవారు, అధిక శాతం బిలాల్ రజియే భర్చీ తీసుకొని వెళ్ళేవారు. ముహమ్మద్ బిన్ ఉమర్ రజి ఈ విధముగా తెల్పినారు: హజ్రత్ బిలాల్ రజి ఆ భర్చీని ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ముందు నాటేవారు. ఆ కాలంలో బయట ఖాళి మైదానంలో పండుగ నమాజ్ సల్పేవారు. ఖాళి ప్రదేశంలోనే పండుగ నమాజ్ సల్పేవారు.(అత్తబ్ఖాతుల్ కుబ్రా లి ఇబ్నే సఅద్ సంపుటి 3, పుట 177, బిలాల్ బిన్ రబాహ్, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 2017).

మరొక కథనములో ఈ విధముగా గలదు: ఎబిసీనియాకు చెందిన నజాషి రాజు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు మూడు భర్చీలను బహుమానంగా పంపించారు. వాటిలో ఒక భర్చీని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ కోసం తీసుకున్నారు. రెండవ భర్చీని హజ్రత్ అలీ బిన్ అబూ తాలిబ్‌కు ఇచ్చారు, మూడవది హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ రజియల్లాహ్ తాలా అన్‌హుకు ఇచ్చారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ కోసం దాచుకున్న భర్చీని హజ్రత్ బిలాల్ రజి పండుగ రోజు చేత పట్టుకొని హుజూర్ (స)కు ముందు ముందుగా నడిచేవారు. ఆపై ఆ భర్చీని హుజూర్ (స) ముందు నాటేవారు. ఆ వైపుకే హుజూర్ (స) నమాజ్ చదువించేవారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పరమపదించిన తరువాత కూడ బిలాల్ రజి ఆ భర్చీ ని తీసుకొని అదే విధముగా హజ్రత్ అబూబకర్ రజికు ముందు ముందుగా నడిచేవారు. (అత్తబ్ఖాతుల్ కుబ్రా లి ఇబ్నే సఅద్ సంపుటి 3, పుట 178, బిలాల్ బిన్ రబాహ్, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 2017).

ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పరమపదించిన తరువాత హజ్రత్ బిలాల్ రజి సిరియాలో జరుగుతున్న జిహాద్‌లో పాల్గొనుటకు వెళ్ళినట్లు కథనాల ద్వారా మనకు తెలుస్తుంది. కథనములో ఈ విధముగా గలదు: రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పరమపదించిన తరువాత హజ్రత్ బిలాల్ రజి హజ్రత్ అబూబకర్ రజి వద్దకు వచ్చి ఇలా విన్నవించుకున్నారు. ఓ రసూలుల్లాహ్ గారి ఖలీఫా! దైవ మార్గంలో జిహాద్ చేయడమే ఒక విశ్వాసి యొక్క గొప్ప కార్యమని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తెల్పుచుండగా నేను విన్నాను. అందుకు హజ్రత్ అబూబకర్ రజి ఓ బిలాల్! రజి నీవు ఏమీ కోరుకుంటున్నావు? అని ప్రశ్నించగా, హజ్రత్ బిలాల్ రజి దైవ మార్గంలో జిహాద్ చేయుటకు నన్ను కూడ పంపుము, జిహాద్ చేస్తూ చేస్తూ నేను మరణించెదను అని విన్న వించుకొన్నారు. అందుకు హజ్రత్ అబూబకర్‌రజి బిలాల్‌తో ఓ బిలాల్ రజి! నేను దేవుని సాక్షిగా , నా గౌరవ, నా బాధ్యత సాక్షిగా తెల్పునదేమనగా, నేను వయస్సు పైబడిన వాడిని, వృద్ధుడిని. నా మరణ సమయం కూడ దగ్గర పడింది. కావున నీవు నా వద్దనే ఉండుము అని కోరినారు. అందువలన హజ్రత్ బిలాల్ రజి హజ్రత్ అబూబకర్ రజి పరమపదించు వరకు వారితోనే ఉన్నారు. హజ్రత్ అబూబకర్ రజి పరమపదించిన తరువాత హజ్రత్ బిలాల్ రజి హజ్రత్ ఉమర్‌రజి వద్దకు వచ్చారు. ఆపై హజ్రత్ అబూబకర్ రజితో విన్నవించుకున్నట్లుగానే విన్నవించుకున్నారు. అప్పుడు హజ్రత్ ఉమర్ రజి కూడ హజ్రత్ అబూబకర్ రజి ఇచ్చిన సమాధానమునే ఇచ్చారు. కాని హజ్రత్ బిలాల్ రజి అందుకు అంగీకరించలేదు. హజ్రత్ బిలాల్ రజి జిహాద్ చేయుటకు పంపమని పట్టుబట్టారు. హజ్రత్ ఉమర్ రజిను అనుమతించమని పదే పదే కోరారు. అందుకు హజ్రత్ ఉమర్ రజి, హజ్రత్ బిలాల్ రజితో నీవు వెళ్ళిపోయినచో అజాన్ బాధ్యతను నేను ఎవరికి అప్పగించాలి? అని ప్రశ్నించగా, హజ్రత్ బిలాల్ రజి హజ్రత్ సఅద్ రజికు అప్పగించుము అని సమాధానం ఇచ్చారు. ఎందుకనగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలోనే సఅద్ రజి అజాన్ ఇచ్చేవారు. అలా హజ్రత్ ఉమర్ రజి హజ్రత్ సఅద్ రజికు వారి తరువాత వారి సంతానానికి అజాన్ బాధ్యతలను అప్పగించారు. హజ్రత్ బిలాల్ రజిను వారి పట్టుదల మేరకు జిహాద్ కొరకు పంపించారు. (అత్తబ్ఖాతుల్ కుబ్రా లి ఇబ్నే సఅద్


**ఇమామ్ వాఖ్యములు**

**"ముస్లిములు పవిత్ర ఖుర్ఆన్‌ను సంపూర్ణముగా ఆచరించనంత వరకు వారెలాంటి అభివృద్ధి సా ధించరు"**
**(మల్ఫూజాత్ సంపుటి 4 పుట 379)**

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*

**ఇమామ్ వాఖ్యములు**

**"ఇస్లాం నిజమైన విజ్ఞానమును ప్రసా దించును. తద్వారా మానవుని నేర జీవితము మృతి చెందును"**
**(మల్ఫూజాత్ సంపుటి 4 పుట 344)**

దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, Ameer Zila warangal, (Telangana)*

సంపుటి 3, పుట 178, బిలాల్ బిన్ రబాహ్, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ 2017).

మరొక కథనములో అజాన్ ఇచ్చు విషయంలో హజ్రత్ బిలాల్ రజి మరియు హజ్రత్ అబూబకర్ రజియల్లాహ్ తాలా అన్‌హుల మధ్య జరిగిన సంభాషణ ఈ క్రింది విధముగా గలదు: మూసా బిన్ ముహమ్మద్ తమ తండ్రి ఆధారంగా ఇట్లు ఉల్లేఖించారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మృతి చెందినప్పుడు హజ్రత్ బిలాల్ రజి ఆ రోజు ఇంకా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను సమాధి చేయక ముందే అజాన్ ఇచ్చారు. వారు అష్హదు అన్న ముహమ్మదు రసూలుల్లాహ్ అనే పదములు పలికినప్పుడు మస్‌జిద్‌లో ఉన్న వారందరు ఎక్కిలు పడుతూ ఏడిచారు. వారు తమ భాష వలన అస్హదు అని పలికేవారు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సమాధి చేయబడిన తర్వాత అజాన్ ఇవ్వాలని హజ్రత్ బిలాల్ రజిను హజ్రత్ అబూబకర్ రజి ఆదేశించగా, అందుకు సమాధానముగా హజ్రత్ బిలాల్ ఇట్లన్నారు: నేను మీతో ఉండాలనే ఉద్దేశంతో మీరు నాకు స్వాతంత్ర్యము ఇచ్చినట్లైతే మీరు చెప్పినట్లే చేయుదును. కాని మీరు నాకు అల్లాహ్ కొరకు స్వతంత్రత కల్పించినట్లైతే మీరు దేని కొరకు నాకు స్వతంత్రతను ఇచ్చినచో, ఈ విషయంలో నాపై ఒత్తిడి చేయకుము అని విన్నవించుకున్నారు. అప్పుడు అల్లాహ్ కొరకే నీకు స్వతంత్రతను కల్పించాలని హజ్రత్ అబూబకర్ రజి తెలిపారు. అందుకు హజ్రత్ బిలాల్ రజి అలా అయినచో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మృతి చెందారు కావున, వారి తర్వాత నేను ఎవరి కొరకు అజాన్ ఇవ్వను అని విన్నవించుకున్నారు. అది మీ ఇష్టమని హజ్రత్ అబూబకర్ రజి బిలాల్ రజికు బదులిచ్చారు. అనంతరం హజ్రత్ బిలాల్ రజి కొంత కాలం మదీనాలోనే నివాసమున్నారు. అనంతరం హజ్రత్ ఉమర్ రజి ఖిలాఫత్ హయాంలో సీరియా వైపు సైన్యములు బయలు దేరినప్పుడు హజ్రత్ బిలాల్ రజి కూడ ఆయా సైన్యములతో కలిసి సీరియా వెళ్ళిపోయారు.(అత్తబ్ఖాతుల్ కుబ్రా లి ఇబ్నే సఅద్ సంపుటి 3, పుట 178, బిలాల్ బిన్ రబాహ్, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ 2017).

ఉసదుల్ ఘాబహ్‌లోని ఒక కథనము ప్రకారము హజ్రత్ అబూబకర్ రజితో హజ్రత్ బిలాల్ రజి "మీరు నాకు మీ కొరకు స్వతంత్రతను ప్రసాదించినచో మీరు నన్ను మీతోనే ఉండాలని ఆదేశించండి, ఒకవేళ మీరు దైవ మార్గములో నాకు స్వతంత్రతను ప్రసాదించినచో నన్ను యుద్ధములో పాల్గొనడానికి పంపండి " అని కోరగా, అందుకు హజ్రత్ అబూబకర్ రజి "అలాగైనచో మీరు వెళ్ళిపోండి" అని హజ్రత్ బిలాల్‌రజికు అనుమతినిచ్చారు. కావున హజ్రత్ బిలాల్ రజి సీరియా వెళ్ళిపోయారు. అలా అక్కడ వారు మృతి చెందే వరకు ఉండిపోయారు. హజ్రత్ అబూబకర్ రజి హయాంలో సిరియాకు వెళ్ళలేదని హజ్రత్ ఉమర్ రజి ఖిలాఫత్ హయాంలో సీరియాకు వెళ్ళిపోయారని అధిక కథనముల ద్వారా తెలుస్తుంది. కాని ఒక కథనము ప్రకారము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మృతి చెందిన తర్వాత హజ్రత్ అబూబకర్ రజి ఖిలాఫత్ హయాంలో కూడ హజ్రత్ బిలాల్ రజి అజాన్ ఇచ్చారనే విషయం తెలుస్తుంది. (ఉసదుల్ ఘాబా ఫి మఅరుఫతుస్సహాబ, సంపుటి 1, పుట 416, బిలాల్ బిన్ రబాహ్, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ లిబ్నాన్).

మరొక కథనములో ఇట్లు తెలుపబడెను. హజ్రత్ బిలాల్ రజి తమ స్వప్నములో నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లంను సందర్శించారు. అప్పుడు హుజూర్ (స) ఓ బిలాల్ రజి! ఇదెంతటి కఠిన మనస్తత్వం. నువ్వు నన్ను సందర్శించుకొనుటకు వచ్చే కాలము ఇంకా రాలేదా? అని స్వప్నంలో ప్రశ్నించగా, హజ్రత్ బిలాల్ రజి ఎంతో దుఃఖముతో మేల్కొన్నారు. ఆపై సీరియా నుండి బయలు దేరి మదీనాకు చేరుకున్నారు. అనంతరం నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం సమాధి వద్దకు చేరుకొని దు:ఖంతో రోధించారు. చాలా బాధతో ఏడ్చారు. ఇంతలోనే హజ్రత్ హసన్‌రజి , హుసేన్ రజి అక్కడికి చేరుకొనగా, హజ్రత్ బిలాల్ రజి వారిని ముద్దాడి, వారిని హత్తుకొన్నారు. హజ్రత్ హసన్ రజి, హుసేన్ రజిలు హజ్రత్ బిలాల్ రజితో మీరు ఫజర్ అజాన్ ఇచ్చినచో వినాలని మేము కోరుకుంటు న్నామని వేడుకొనగా, మరుసటి రోజున హజ్రత్ బిలాల్ రజి మస్‌జిద్ పైకప్పు ఎక్కి, అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ అనే పదములు అజాన్ రూపంలో పలుకగా కథకుని ఇట్లు చెప్పిరి. ఆ సమయంలో మదీనా మొత్తం ఉలిక్కి పడెను. అనంతరం వారు అష్హదు అల్లాఇలాహ ఇల్లల్లాహ్ అనే పదములు పలుకగానే మదీనా ఇంకా కంపించిపోయినది. ప్రజలు ఒక్కసారిగా నిద్ర నుండి మేల్కొన్నారు. తర్వాత వారు అష్హదు అన్న ముహమ్మద రసూ లుల్లాహ్ అని పలుకగా మహిళలు సైతం తమ గదుల నుండి బయటికి వచ్చారు. కథకుడు ఇంకా ఇట్లు చెప్పెను. స్త్రీ, పురుషులు ఆ రోజు కంటే ఎక్కువగా ఏడ్చిన రోజు మరొకటి లేకుండెను. (ఉసదుల్ ఘాబా ఫి మఅరుఫతుస్సహాబ, సంపుటి 1, పుట 417, బిలాల్ బిన్ రబాహ్ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్ లిబ్నాన్).

ప్రజలకు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలమును, అప్పటి అజాన్‌ను గుర్తు తెచ్చుకొని చాలా ఆందోళనకు గురైనారు.

హజ్రత్ ఉమర్ రజి ఖిలాఫత్ కాలములో హజ్రత్ బిలాల్ రజి యుద్ధములో పాల్గొనుటకు అనుమతిని కోరారు. అందుకు హజ్రత్ ఉమర్ రజి అజాన్ ఇచ్చుటలో మీకు ఏ ఇబ్బంధి కల్గుచున్నదా? అని ప్రశ్నించగా, అందుకు బదులుగా హజ్రత్ బిలాల్ రజి " నేను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశానుసారం అజాన్ ఇచ్చేవాడిని. కాని వారు మృతి చెందారు. అనంతరం నేను హజ్రత్ అబూబకర్ రజి ఆదేశానుసారం అజాన్ ఇచ్చాను. ఎందుకనగా వారు నాకు స్వతంత్రమును కల్పించారు. అనంతరం వారు కూడ మృతి చెందారు. ఓ బిలాల్! అల్లాహ్ మార్గములో యుద్ధము చేయుట కంటే గొప్ప ప్రార్థన మరొకటి లేదు అని ఒక సందర్భములో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించుచుండగా నేను విన్నాను. అందుకే యుద్ధంలో పాల్గొనాలని భావిస్తున్నాను అని సమాధానం ఇచ్చారు. ఆపై హజ్రత్ బిలాల్ రజి సీరియా వెళ్ళిపోయారు. హజ్రత్ ఉమర్ రజి సీరియా వచ్చినప్పుడు హజ్రత్ ఉమర్ రజి ఆదేశం మేరకు హజ్రత్ బిలాల్ రజి అజాన్ ఇచ్చారు. కథకుడు ఇట్లు తెలిపెను. ఆ రోజు కంటే ముందు వారిని ఇంతగా ఏడ్చినట్లు మేము ఎన్నడు చూడలేదు. (ఉసదుల్ ఘాబా ఫి మఅరుఫతుస్సహాబ, సంపుటి 1, పుట 416-417, బిలాల్ బిన్ రబాహ్, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్రూత్).

హజ్రత్ బిలాల్ రజి చివరి కాలమును ప్రస్తావిస్తు హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని రజియల్లాహు తఆలా అన్‌హు ఇట్లనిరి. హజ్రత్ బిలాల్ రజి చివరి కాలములో సీరియా వెళ్ళిపోయారు. వారు వివాహం చేసుకోవడం కొరకు వారికి ఎవరు కూడ అమ్మాయిని ఇచ్చే వారు కాదనే ప్రస్తావనలు కూడ మన ముందు ఉన్నాయి. కాని వారికి అంతకు ముందు అనేక వివాహములు అయినట్లు, వివాహ సంబంధములు కుదిరినట్లు మరి కొన్ని కథనములలో చెప్పబడ్డాయి. సీరియా వెళ్ళుచున్నందుకే బహుశా వివాహ సంబంధము దొరకక పోవచ్చును.లేదా సీరియాలో కూడ వివాహ సంబంధము దొరకలేదు కావచ్చును. ఏది ఏమైనప్పటికి హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం హయాంలో వారికి అనేక వివాహములు జరిగినట్లు కూడ కథనములు గలవు. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఇలా

| ఇమామ్ వాఖ్యములు | "ముస్లిములు పవిత్ర ఖుర్ఆన్‌ను సంపూర్ణముగా ఆచరించనంత వరకు వారెలాంటి అభివృద్ధి సాధించరు" (మల్ఫూజాత్ సంపుటి 4 పుట 379) |
|---|---|

**SUFI AHMAD Sb. Jama'at Ahmadiyya Penugonda, Dist: West Godawari (Andhra Pradesh)**

వ్రాసారు: హజ్రత్ బిలాల్ రజి సిరియా ప్రజలతో నేను ఒక ఎబిసీనియా జాతీయుణ్ణి, మీకు ఇష్టమున్నచో సంబంధము ఇవ్వండి. లేదా రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరుణ్ణి అని భావించి సంబంధము ఇచ్చినచో మేలు చేసిన వారగుతారని వారు సీరియాలో ఒక చోట వివాహ సంబంధము కొరకు సందేశము పంపారు. అందుకు అక్కడి ప్రజలు వారికి వివాహం చేయగా, అలా వారు అక్కడే సీరియాలో వుండిపోయారు. కాని అంతకు ముందు కూడ వారికి వివాహములు అయినవి. బహుశా వారు మృతి చెంది వుండచ్చును లేదా వెంట వెళ్ళుటకు ఎవరు ఒప్పుకోకపోవచ్చును. లేదా సీరియాలో వివాహ చేసుకోదలచిరి కావచ్చును. ఏది ఏమైనప్పటికి అంతకు ముందు వారికి వివాహములు జరిగిన విషయము ఇక్కడ స్పష్టము చేయదలిచాను. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజి కూడ ఇక్కడ ఇదే వ్రాశారు. మిగతా కొన్ని కథనములు కూడ ఇలాగే తెలుపుచున్నవి. ఏ నేపథ్యములో వీరిలా వ్రాశారో అల్లాహ్‌కే మంచిగా తెలుసు. సారాంశమేమనగా వారు అక్కడ సంబంధము కోరగా అక్కడే వారి వివాహమైనది. అలా సీరియాలోనే వుండిపోయిరి. చెప్పదలచిన అసలు విషయము ఒక స్వప్నము. ఇది మాట వరుసకు వచ్చెను. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ ఇట్లు వ్రాసిరి. ఒక సారి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ బిలాల్ రజి స్వప్నములో ఓ బిలాల్! నువ్వు మమ్ములను మరిచేపోయావు. మా సమాధిని దర్శించుకొనుటకు ఎన్నడు రానే రాలేదు అని గుర్తుచేయగా, హజ్రత్ బిలాల్ రజి తక్షణమే మేల్కొని ప్రయాణమునకు సన్నాహాలు చేసుకొని మదీనాకు చేరుకున్నారు. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం సమాధిపై ఎక్కి ఎక్కి పడి ఏడుస్తూ దుఆ చేసారు. వారికి అప్పుడు వచ్చిన దుఃఖముతో బిలాల్ రజి వచ్చారనే విషయం ప్రజలకు తెలిసి పోయినది. అనగా అంతగా ఏడ్చారు. అప్పటి వరకు యుక్త వయస్సుకు చేరిన హజ్రత్ హసన్‌రజి, హుసేన్ రజిలు పరుగెత్తుకుంటూ అక్కడికి చేరుకొని వారిని ఓదార్చారు. ఆపై ఇలా అన్నారు. మీరు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కాలములో అజాన్ ఇచ్చేవారు కదా!. అందుకు బిలాల్ రజి అవునని వారు సమాధానమిచ్చారు. అప్పుడు వారిరువురు మాకు కూడ మీ అజాన్ వినాలని ఉంది అని తెలుపగా, హజ్రత్ బిలాల్ రజి అజాన్ ఇచ్చారు. ప్రజలందరు ఆ అజాన్‌ను విన్నారు. ( ఖుత్బాతే మహ్‌మూద్, సంపుటి 25, పుట 182, జుమా ప్రసంగం, మార్చి 10, 1944)

హజ్రత్ ఉమర్ రజి తమ ఖిలాఫత్ హయాంలో వేతనములు ఇచ్చుటకు ఒక కార్యాలయమును ఏర్పాటు చేశారు. అనగా అకౌంటు రిజిస్టర్లు అనగా ఖాతా పుస్తకములు మొదలగునవి సిద్ధము చేయించారు. రికార్డులు మొత్తం సిద్ధము చేయించిన తరుణంలో హజ్రత్ బిలాల్ రజి సీరియా కు వెళ్ళిపోయి, అక్కడే ముజాహిదీన్లతో కలిసి వుండిపోయారు. ఆ సమయంలో హజ్రత్ ఉమర్ రజి బిలాల్ రజితో ఓ బిలాల్‌రజి! నువ్వు వేతనముల కార్యాలయము వద్ద నీ బదులుగా ఎవరికి బాధ్యతలు అప్పగిస్తావు లేదా నీ ప్రతినిధిగా ఎవరిని నియమిస్తావు అని ప్రశ్నించగా, హజ్రత్ బిలాల్ రజి అబూ రువైహను నియమించెదను, ఎందుకనగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మా ఇరువురి మధ్య ఏర్పరచిన సోదరత్వము వలన నేను వారిని ఎన్నడు మరచిపోను అని సమాధానమిచ్చారు. (అత్తబ్ఖాతుల్ కుబ్రా లి ఇబ్నే సఅద్ సంపుటి 3, పుట 176, బిలాల్ బిన్ రబహ, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 2017).

హజ్రత్ బిలాల్ రజి సూటిగా మట్లాడే సంఘటన ఒకటి ఇట్లు లభిస్తుంది. అమర్ బిన్ మైమూన్ తన తండ్రి ఆధారంగా ఇట్లు ఉల్లేఖించారు. హజ్రత్ బిలాల్ రజి సోదరుడు తనను తాను అరబ్బుదని చెప్పుకునే వాడు. వారు తమనతాము అరబ్ వంశానికి చెందిన వ్యక్తిననే భావించేవారు. కావున అరబ్‌కు చెందిన ఒక స్త్రీకి, హజ్రత్ బిలాల్ వచ్చినచో మేము నీతో వివాహము కుదుర్చుకుంటాము అని వివాహ సందేశము పంపారు. హజ్రత్ బిలాల్ రజి వచ్చి, తషహ్హుద్ చదివి ఇలా అన్నారు. నేను బిలాల్ బిన్ రబాహ్‌ను. ఇతడు నా సోదరుడు. నా సోదరుడు సత్ప్రవర్తనలు, ధార్మిక పరంగా అంత మంచి వ్యక్తి కాదు. అయినను మీరు ఇతనికిచ్చి వివాహము చేసుకోదలచినచో చేసుకోండి. లేదా ఈ సంబంధాన్ని వదులుకోండి అని సలహా ఇచ్చారు. అయినా కూడ వారు వారి సోదరునితో వివాహము కుదుర్చుకున్నారు.(అత్తబ్ఖాతుల్ కుబ్రా లి ఇబ్నే సఅద్ సంపుటి 3, పుట 179, బిలాల్ బిన్ రబహ, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 2017).

జైద్ బిన్ అస్లమ్ ఇట్లు ఉల్లేఖించారు. బనూ అబూ బుకైర్ రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఫలానా వ్యక్తితో మా సోదరి వివాహము జరిపించండి అని వేడుకొనగా, బిలాల్ రజి గురించి మీ అభిప్రాయము ఏమిటి? అని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అడిగారు. మరల వారు రెండవసారి వచ్చి ఫలానా వ్యక్తితో మా సోదరి వివాహము జరిపించండి అని వేడుకొనగా, బిలాల్ రజి గురించి మీ అభిప్రాయము ఏమిటి? అని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అడిగారు. వారు నిరాకరించి మూడవ సారి వచ్చి, ఫలానా వ్యక్తితో మా సోదరి వివాహము జరిపించండి అని విన్నవించుకున్నారు. బిలాల్ రజి గురించి మీ అభిప్రాయము ఏమిటి? స్వర్గీయులలోని వ్యక్తి గురించి మీ అభిప్రాయమేమిటి? అని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అడుగగా, కథకుడు ఇలా తెలిపెను. అప్పుడు వారు తమ సోదరి వివాహము హజ్రత్ బిలాల్ రజితో జరిపించారు. (అత్తబ్ఖాతుల్ కుబ్రా లి ఇబ్నే సఅద్ సంపుటి 3, పుట 179, బిలాల్ బిన్ రబహ, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 2017).

వివాహము కాలేదని హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ వ్రాసిన కథనమును నేను ఇంతకు ప్రస్తావించాను. అది వేరే నేపథ్యములో చెప్పి ఉండవచ్చును. ఎందుకనగా వివాహములు జరిగినట్లు ఈ కథనము ద్వారా కూడ తెలుస్తుంది. హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారిట్లు వ్రాసిరి. ఒకసారి హజ్రత్ ఉమర్ రజి ఖిలాఫత్ హయాంలో వారు, అబూసుఫ్యాన్, మక్కా విజయము సందర్భమున ఇస్లాంలో చేరిన మరి కొందరు నాయకులు హజ్రత్ ఉమర్ రజితో భేటి అగుటకు వచ్చారు. ఇది అదనంగా వ్రాసినది కావచ్చును. హజ్రత్ ఉమర్ రజి ఖిలాఫత్ హయాంలో వారు, అబూసుఫ్యాన్, మక్కా విజయము సందర్భమున ఇస్లాంలో చేరిన మరి కొందరు నాయకులు హజ్రత్ ఉమర్ రజితో భేటి అగుటకు వచ్చారు. అనుకోకుండా అప్పుడే బిలాల్ రజి, అమ్మార్ రజి, సుహైబ్ రజి మొదలగు వారు కూడ హజ్రత్ ఉమర్ రజితో భేటి అగుటకు చేరుకొన్నారు. వీరందరు బానిసలుగా, నిరుపేదలుగా జీవించారు. కాని ఆరంభములోనే ఇస్లాం స్వీకరించిన వారిలో వీరు కూడ ఉన్నారు. హజ్రత్ ఉమర్ రజికు సమాచారము పంపబడగా బిలాల్ మొదలగు వారితో భేటి అగుటకు ముందుగా పిలిపించారు. ఇంకా మూర్ఖత్వ కాలపు విషయములు తనలో వున్నందున అబూసుఫ్యాన్ ఈ దృశ్యమును చూసి కోపోద్రిక్తుడయ్యెను. మేము నిరీక్షించుచుండగా ఈ బానిసలకు భేటి అయ్యే అవకాశము ఇచ్చినందున మేము ఈ అవమానమును కూడ చూడవలసి వచ్చిందా అని ఆవేదన చెందెను. అయితే ఇది ఎవరి తప్పిదము ? అని సుహైల్ వెంటనే “ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మనందరిని అల్లాహ్ వైపు ఆహ్వానించారు. కాని ఆ బానిసలే ముందుగా విశ్వసించారు. మనము ఆలస్యము చేశాము. కావున వారికి మనపై ప్రాధాన్యత లభించవలెనా? లేదా?” అని ప్రశ్నించెను.

(సీరత్ ఖాతమున్నబీయ్యీన్ పుట 369).

హజ్రత్ బిలాల్ రజి స్థాయి అంతస్తులను ప్రస్తావిస్తు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్‌హు ఈ సంఘటనను ఇట్లు ప్రస్తావించారు. హజ్రత్ ఉమర్ రజి తమ ఖిలాఫత్ హయాంలో ఒకసారి మక్కాకు వచ్చారు. ప్రారంభ కాలంలో తల వెంట్రుకలను పట్టుకొని ప్రజలు అటు ఇటు లాక్కెళ్ళిన ఆయా బానిసలు ఆ సమయంలో ఒక్కొక్కరుగా హజ్రత్ ఉమర్ రజితో భేటి అగుటకు వచ్చారు. అది పండుగ రోజు. కావున మక్కాకు చెందిన పెద్ద పెద్ద

నాయకుల కుమారులు హజ్రత్ ఉమర్ రజికు శుభాకాంక్షాలు తెలుపుటకు వచ్చారు. వారు కూర్చొన్న కొద్ది సమయంలోనే బిలాల్ రజి అక్కడికి చేరుకొన్నారు. గతంలో బిలాల్ ఒక బానిస. ప్రజలు వారిని హింసించేవారు. వారిని బొడుసులు, మొనలు తేలినటువంటి రాళ్ళపై శరీరంపై బట్టలు తొలగించి లాకెళ్ళే వారు. వారి యదపై పెద్ద పెద్ద మందమైన రాళ్ళు పెట్టి లాత్, ఉజ్జాను పూజిస్తానని చెప్పమని ప్రజలు అనేవారు కాని వారు అష్హదు అల్లాఇలాహ ఇల్లల్లాహ్ అని మాత్రమే అనేవారు. బిలాల్ రజిను చూడగానే మీరు కొంచెం వెనక్కి జరిగి బిలాల్ రజికు కూర్చొనుటకు స్థానము ఇవ్వవలెనని హజ్రత్ ఉమర్ రజిఆ నాయకులను కోరారు. అలా అక్కడ బిలాల్ రజి కూర్చొనగానే గతంలో బానిసైన మరొక అనుచరుడు వచ్చెను. ఇంకాస్త వెనక్కి జరిగి వీరికి కూడ కూర్చొనుటకు స్థలము ఇవ్వగలరని మరల హజ్రత్ ఉమర్ రజి ఆ నాయకులను కోరారు. అలా కొంచెం సమయము గడవగానే మరొక అనుచరుడు వచ్చారు. ఇంతకు ముందు కోరినట్లుగానే కొంచెంచ వెనక్కి జరిగి వీరికి కూడ కూర్చొనుటకు స్థలము ఇవ్వండని మరల హజ్రత్ ఉమర్ రజి ఆ నాయకులను కోరారు. దైవకముగా అల్లాహ్ తఆలా వారిని కించపరచవలెనని ఊహించినందున ఒక్కొక్కరి తర్వాత ఏనిమది నుండి పది మంది గతంలో బానిసలుగా ఉన్న అనుచరులు అక్కడికి వచ్చారు. అప్పుడు కూడ కొంచెం వెనక్కి జరిగి వీరికి కూడ కూర్చోవడానికి స్థలము ఇవ్వండని గతము మాదిరిగానే హజ్రత్ ఉమర్ ఈ సారి కూడ కోరెను. ఆ కాలములో పెద్ద పెద్ద హాళ్లు నిర్మించబడేవి కావు. సాధారణ భవనములు వుండేవి. అందులో ఎక్కువ ప్రజలు కూర్చునే అవకాశము వుండేది కాదు. బానిసలతో ఆ గది నిండిపోయినందున ఆ నాయకులు విధి లేక చెప్పుల వద్ద కూర్చో వలసి వచ్చినది. ఈ అవమానమును వారు భరించలేక పోయారు. వెంటనే వారు అక్కడి నుండి లేచి బయటికి వచ్చి నేడు మనము ఎంతో అవమానాన్ని ఎదుర్కొన్నామని పరస్పరం మాట్లాడుకోసాగరు. మనకు సేవలందించే ఈ బానిసలు పైన కూర్చోగా మనము వెనుకకు జరగవలసి వచ్చినది. తుదకు వెనక్కి జరగుతు జరుగుతు మనము చెప్పుల వద్దకు చేరుకున్నాము. అందరి దృష్టిలో మనము అవమానము, అమర్యాదకు గురైనాము అని చింతించ సాగెను. వారిలో అందరికంటే ఎక్కువ తెలివి గల వారొకరు ఇట్లనెను. మనకు అవమానము కలిగిన విషయము నిజమే. కాని ఇది ఎవరి వలన జరిగినదనే ప్రశ్న ఇచట ఉత్పన్నమ గుతుంది. మన తండ్రులు, సోదరులు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, వారి అనుచరులను హింసించినప్పుడు ఈ బానిసలు వారి కొరకు ప్రాణాలు అర్పితము చేసేవారు. నేడు ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రభుత్వము కొనసాగుతు న్నందున ఎవరికి గౌరవము లభించునో మీరే గ్రహించండి. దండించే మీకా లేక తమ ప్రాణాలు ఇస్లాం కొరకు త్యాగము చేసేవారికి గౌరవము లభించునా? వారికే గౌరవము లభించవలసినచో నేడు మీకు జరిగిన అవమానము వలన మీరెందుకు ఫిర్యాదు చేస్తున్నారు. మీ తల్లిదండ్రుల కర్మల ఫలితముగా నేడు బానిసలకు లభిస్తున్న గౌరవము మీకు లభించడం లేదు. ఒక వివేకి ఈ విషయము చెప్పినప్పుడు వారికి ఈ విషయము అర్థమైనది. కావున మిగతా వారందరు ఇట్లనిరి. మాకు అసలు విషయము అర్థమైనది. ఇప్పుడు ఈ అవమానానికి ఏదైనా చికిత్స వుందా? లేదా? నిశ్చయముగా మన తల్లిదండ్రుల ద్వారా ఒక పెద్ద తప్పిదమే జరిగినది. కాని చివరికి ఈ తప్పిదానికి ఏదో ఒక మార్గము వుండవలెను. కావున మనము ఈ అవమానానికి మార్గమును కూడ మనము హజ్రత్ ఉమర్ రజినే అడుగుతాము అని నిశ్చయించుకొన్నారు. వారు మరల హజ్రత్ ఉమర్ రజి వద్దకు చేరుకోగా, అప్పటి వరకు సమావేశము ముగిసిపోయెను. అనుచరులు వెళ్ళిపోయిరి. వారు హజ్రత్ ఉమర్ రజితో ఇట్లనిరి. ఈ సమావేశములో మాకు లభించిన దుఃఖము గురించి మేము మీతో అభిప్రాయము తెలుసుకొనుటకు వచ్చాము. హజ్రత్ ఉమర్ రజి ఇట్లనిరి. చూడండి! మీరు తప్పుగా భావించకండి. వీరు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులు. వీరు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం సమావేశములో వీరు ఎల్లప్పుడు ముందు వరుసలో కూర్చొనేవారు. అందుకే వారిని ముందు వరుసలో కూర్చొనబెట్టక నాకు తప్పలేదు అని వివరించారు. మీ ఈ తప్పని పరిస్థితిని మేము అర్థము చేసుకున్నాము. కావున ఈ అవమానమునకు ఏదైనా ప్రత్యామ్నాయ మార్గముందా? ఈ అమర్యాద మచ్చను తొలగించుకొనుటకు ఏదైనా నీరు వుందా? అని తెలుసుకొనుటకు మేము మీ వద్దకు వచ్చాము అని విన్నవించుకున్నారు. హజ్రత్ ఉమర్ రజికు ఆ యువకుల తల్లిదండ్రుల వైభవము, వారి పలుకుబడి గురించి బాగుగా తెలుసు. వారు ఆ యువకుల నుండి ఈ విషయము విన్నప్పుడు వీరు తమ పాపముల వలన ఎక్కడికి దిగజారిపోయారో ఆలోచించి వారి కండ్లలో నీళ్ళు తిరిగినవి. వారు ఎంతగా దుఃఖానికి గురైనారనగా వారు మాట్లాడలేక పోయారు. కేవలం తమ హస్తముతో సీరియా వైపు సంజ్ఞ చేశారు. అప్పుడు ఆ రోజులలో అక్కడ ఖైసర్ సైన్యములతో యుద్ధము జరుగుతుంది. అనగా మీరు ఈ యుద్ధములో పాల్గొని తమ ప్రాణాలు అర్పించి మీకు అంటిన మచ్చను తొలగించు కోవచ్చునని సూచించారు. కావున అప్పుడు వారు వెంటనే బయటికి వెళ్ళి తమ ఒంటెలపై స్వారి అయి, సీరియా వైపు వెళ్ళిపోయారు. వారిలోని ఒక్క వ్యక్తి కూడ తిరిగి రాలేదని చరిత్ర ద్వారా మనకు తెలుస్తుంది. ఈ విధంగా తమ తల్లిదండ్రుల కర్మల వలన తమ నుదుట అంటిన మచ్చను తమ రక్తముతో తుడిచి వేసుకున్నారు.

(తఫ్సీరే కబీర్, సంపుటి 9, పుట 289-290).

కావున మొదటి విషయము ఏమనగా త్యాగములు సమర్పించినప్పుడే గౌరవ స్థానము లభించును. ఆరంభము నుండే విశ్వసనీయతను కనబర్చినవారు ఉన్నత స్థానము పొందుతారని ఇస్లాం గొప్పగా బోధిస్తుంది. ఎబిసీనియా బానిస అయినను లేదా మరో ప్రాంతానికి చెందిన బానిస అయినను ఇస్లాం సూచించిన మేరకు అర్హత ప్రకారము ప్రతి ఒక్కరికి గౌరవం లభించును. ధనికులు లేదా బీదలు అనే వ్యత్యాసముండదు. త్యాగములు సమర్పించువారు, విశ్వసనీయత చూపువారు, తమ ప్రాణములు అర్పించువారు, ప్రతిది సమర్పించువారైనచో వారికి ఉన్నత స్థానము లభించును. హజ్రత్ బిలాల్ రజి ప్రస్తావన ఇంకా వున్నందున అది ఇంకా కొనసాగును. ఇన్‌షాఅల్లాహ్.

---

**(1వ పేజి తరువాత చదువుము).**

**8వ సూక్తిని హుజూర్ (ర) గారు ఈ విధముగా విశదీకరించిరి:**

భవిష్యవాణి స్పష్టముగా ఉన్నా కూడ హుజూర్ (స) ప్రతి రూపమును గూర్చి ప్రత్యేక శ్రద్ధ చూపవలెనని ఈ సూక్తిలో తెలుపడమైనది. అయినా కూడ అతనిని ఇస్లాం వైపు ఆహ్వానించెదరు. వాస్తవానికి హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రపంచాన్ని ఇస్లాం వైపు ఆహ్వానించిరి. **అనువాదం:** నిరక్షరాస్యులలో వారిలో నుండే ఒక గొప్ప ప్రవక్తను నియమించిన వాడే అతడు. అతడు వారికి అతని సూక్తులు చదివి వినుపించును. వారిని పవిత్రులుగా చేయును. వారికి గ్రంథమును, వివేకమును బోధించును. దీనికి ముందు వారు నిశ్చయముగా స్పష్టమైన దుర్మార్గములో పడివుండిరి. వారిలో నుండే ఇంత వరకు వారితో కలియని ఇతరుల వైపు కూడ (ఇతనిని పంపెను) అతడు శక్తి మంతుడు, వివేకవంతుడు.

(అల్-జుముఅ : 03-04)

**సయ్యిదినా హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్రాబే రహ్మహుల్లాహు తాలా ఈ సూక్తులను ఈ విధముగా విశదీకరించిరి:** "ఈ సూక్తులలో ఏ చివరి వర్గమును గూర్చి ప్రస్తావించబడినదో ఆ వర్గములో కూడ పై సూక్తిలో పేర్కొనబడిన ప్రవక్తయే అవతరించునని స్పష్టముగా తెలుపడమైనది. కాని ఈ సూక్తి చివరిలో మాత్రం 2వ నెంబర్ సూక్తిలో పేర్కొనబడిన నాలుగు విశిష్టతలను గూర్చి మాత్రం పేర్కొనబడలేదు. కేవలం అజీజ్ మరియు హకీమ్ అనే రెండు విశిష్టతలను మాత్రం తెలుపడం జరిగింది. తద్వారా తెలియు విషయమేమనగా, ముందుగా పేర్కొనబడిన ప్రవక్తయే రెండవసారి మరల అవతరించడు. కేవలం అతని ప్రతిరూపంలో ధర్మశాస్త్ర రహితముగా అవతరించును. ఆశ్చర్యకరమైన విషయమేమనగా హజ్రత్ ఈసా (అ) ను గూర్చి కూడ ఈ రెండు దైవ విశిష్టతలనే పేర్కొనడం జరిగింది. అని అల్లాహ్ తాలా తెలిపెను. (అన్నిసా:159)

(2వ పేజి తరువాత)

ఆ పదాలు ఆలకించగానే అతని హృదయములో క్రైస్తవ ధర్మపు ఉత్సాహం మరల ఉప్పొంగెను. తన ముందు ఒక దేవుని అవతారుడు కూర్చోని ఉన్నాడు, ఇస్రాయీలీల భాషలో సంభాషిస్తున్నాడని అతడు గ్రహించెను. ఇంతలోనే నీవు ఏ ప్రాంతానికి చెందినవాడవు అని రసూలుల్లాహ్ సల్లల్లాము అలైహి వసల్లం అతనిని అడిగిరి. అతడు నైన్వా ప్రాంతవాసినని సమాధానం ఇవ్వగా, నైన్వా ప్రాంతానికి చెందిన ఒక సజ్జనుడు, నా వలే వారు కూడ ఒక దేవుని ప్రవక్త అయినా మత్తా కుమారుదైన యూనుస్ ప్రాంతవాసివా? అని అతడికి గుర్తుచేసి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇస్లాం సందేశమును వారికి అందించిరి. అద్దాస్ ఆశ్చర్యమంత కొంత సమయంలోనే విచిత్రములోకి, విచిత్రమంతయు విశ్వాసంలోకి కొన్ని క్షణాలలోనే మారిపోయింది. మరికొంత సమయంలోనే ఆ అపరిచిత సేవకుడు కన్నీరు నిండిన కళ్ళతోఆ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను కౌగిలించుకొని వారి (స) చేతులను, కాళ్ళను ముద్దు పెట్టుకోనసాగెను. " **(నబీయోంక సర్దార్: 40)**

పాఠకులారా! శ్రద్ధగా ఆలోచించండి. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం శరీరమంతయు రక్తంతో నిండి యున్నది. చాలా బాధలో ఉన్నారు. గాయాలతో బాధపడుచూ, అలసిపోయి, సొమ్మసిల్లిపడిన, బలహీనముగా ఉన్నా కూడ వారు (స) అవకాశంను జారవిడుచు కోకుండా అద్దాస్‌కు ప్రచారం చేసి ముసల్మానుడిగా మార్చిరి. మరియు నరకపు అగ్ని నుండి కాపాడిరి.

హజ్రత్ ఆయిషా (రజి) ఒకమారు ప్రవక్త (స) ను ఇలా ప్రశ్నించిరి. మీపై ఒహద్ దినము కన్న కఠినమైన దినము ఏదైనా ఉందా?. (ఒహద్ యుద్ధములో హుజూర్ (స) శుభప్రదమైన దంతములు విరిగిపోయాయి, ముఖానికి కూడ గాయాలైనవి) అందుకు హుజూర్ (స) ఇలా తెల్పిరి: " ఆయిషా! మీ జాతిలో నేను చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నాను గాని తాయిఫ్ ప్రయాణంలో అన్నింటి కంటే తీవ్ర కష్టాన్ని ఎదుర్కొన్నాను. ఇస్లాం సందేశమును అందించుటకు నేను తాయిఫ్ నగరానికి వెళ్ళాను. (మక్కా వారి కఠిన వైఖరి నుండి విముక్తి కల్గించి ఇస్లాం సందేశంను ప్రచారం చేసుకొనుటకు తగిన సహకారం అందించ మని కోరగా) వారు కూడ సహాయం అందించుటకు నిరాకరించిరి. ప్రజల కఠిన వైఖరికి బాధ పడుచూ అలసత్వం వలన ఎక్కడి వెళ్ళుచున్నానో తెలియని పరిస్థితులలో నేను తీవ్ర దు:ఖముతో తల దించుకొని కుర్నే సఅలిబ్ పర్వతముపు దరి చేరుటకు వెళ్ళు చుండగా ఒక మేఘం నాకు నీడ నిస్తుండటాన్ని చూసినాను. అప్పుడు పర్వతాల దైవదూత నన్ను పిలిచి నాకు సలామ్ చేసి ఇలా వేడుకొనెను. నేను పర్వతాల దేవదూతను, మీ ప్రభువు నన్ను మీ ఆజ్ఞా శిరసా వహించమని మీ దగ్గరకు పంపినాడు. ఓ ముహమ్మద్! (స) మీకేం కావాలి. నేను ఈ రెండు పర్వతాలను వారిపై పడవేయనా?. దయామయ ప్రవక్త (స) ఇలా సమాధానం ఇచ్చిరి. వద్దు వద్దు అలా చేయకుము. అల్లాహ్ తాలా వీరిలో నుండే అల్లాహ్‌ను ఆరాధించువారిని మరియు అతనికి మరెవ్వరిని సాటి కల్పించని ప్రజలకు పుట్టించునని నేను ఆశిస్తున్నాను."

పాఠకులారా! కొంచం ఆలోచించండి. పర్వతాల దేవదూతలు వచ్చి ఒకవేళ అనుమతించినచో తాయిఫ్‌కు ఇరువైపుల ఉన్న పర్వత శ్రేణులను వాటిపై పడవేసి వారిలో ఏ ఒక్కరు సజీవంగా ఉండకుండా శిక్షించెదనని విన్నవించగా ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఏమని సమాధానం ఇచ్చారో చూడండి. " వద్దు వద్దు అలా చేయకుము. అల్లాహ్ తాలా వీరిలో ంండే అల్లాహ్‌ను ఆరాధించువారిని మరియు అతనికి మరెవ్వరిని సాటి కల్పించని ప్రజలకు పుట్టించునని నేను ఆశిస్తున్నాను." మానవ జాతి తమ సృష్టికర్తను గుర్తించాలని, ప్రపంచం నుండి అన్యారాధన కనుమరుగు కావాలని ఎంతటి తపనో ఉన్నదో వారి (స) సమాధానంలోనే మనకు కనిపిస్తుంది.

అల్లాహ్ తాలా మనందరికి ప్రచారం చేయు భాగ్యమును కల్పించుగాకా! (ఆమీన్).

ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఔనత్యాన్ని గూర్చి హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం గారి బోధనలు:

సయ్యిదినా హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం అనుబంధములో ఇట్లు తెల్పిరి: " ఈ వ్యాస మంతయు అబూతాలిబ్ ఘట్టముగా పుస్తకాలలో పొందుపర్చ బడినప్పటికి నేను పైన తెల్పిన అంశం మాత్రం అల్లాహ్ తాలా ఈ విధేయుడి హృదయములో అవతరింప జేసినటువంటి సువార్తవాణి పంక్తులు. కేవలం వివరించి చెప్పుటకు మాత్రమే ఈ విధేయుడు అక్కడక్కడ కొన్ని పదాలను ఉపయోగించడం జరిగింది. ఈ సువార్త వాణి పంక్తుల ద్వారా అబూతాలిబ్ యొక్క సానుభూతి, మనస్తత్వం బహిర్గతమవుతుంది. కాని ఈ సానుభూతి కూడ ప్రవక్తృత్వ కిరణాలను, పటిష్ట సంకేతాలను చూసిన తరువాతయే జన్మించినదని పూర్తి నమ్మకంతో చెప్పగలము. మన ప్రియతమ నాయకులు, అధికారులు సల్లల్లాహు అలైహి వసల్లం తమ జీవితంలోని అధిక భాగంను, అనగా 40 సంవత్సరాల వయస్సు వరకు నిరాధారముగా, ఆవేదన భరితముగా, నిస్సహాయక స్థితిలో గడిపిరి. ఆ ఒంటరి జీవితంలో ఏ సమీప బంధువు గాని, దూరపు బంధువు గాని వారి హక్కును తీర్చుటకు ప్రయత్నించలేదు. చివరికి ఆ ఆధ్యాత్మిక చక్రవర్తి బాల్యంలో ఒక అనాథ బాలునిగా ఆటవిక జాతుల, సంచార జాతుల మహిళలకు అప్పగించబడిరి. ఆ నిస్సహాయా, నిరుపేద స్థితిలోనే ఆ నాయకుడు బాల్యంను గడిపినాడు. కొంత అవగాహన వయస్సు రాగానే ఆ ఆటవిక, సంచార జాతుల మహిళలు అనాథ బాలుడి వలే మేకలను మేపుకరావడం కోసం సర్వలోకాల అధికారిని పంపేవారు. ఆ దుర్భర రోజులలో కొన్ని ధాన్యపు గింజలు, మేక పాలు తప్ప వారికి అహారముగా మరేమి లభించేది కాదు. అంతేగాకా వారు యుక్తవయస్సుకు చేరుకున్న తరువాత అందరికన్న అందముగా, అకర్షణీయముగా ఉన్నాకూడ ఏ బంధువు వారికి తమ కూతురునిచ్చి వివాహం చేయుటకు ముందుకు రాలేదు. 25 సంవత్సరాల వయస్సుకు చేరుకున్న తరువాత దేవుని దయాకరుణల వలన అనుకోకుండా మక్కాకు చెందిన ఒక ధనిక వింతతురాలు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను వివాహమాడుటకు ముందుకు వచ్చి వివాహం చేసుకున్నది. నిజానికి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పిన్నాన్నలు అబూతాలిబ్, హంజ, అబ్బాస్ వంటి పేరు ప్రఖ్యాతలు గల వ్యక్తులు ఉన్నాకూడ, అన్నింటిని మించి అబూతాలిబ్ మక్కా అధికారుల సభ్యుడు, తమ జాతికి నాయకుడు, ప్రాపంచిక భోగభాగ్యాలు, సిరిసంపదలను అనంతముగా నిలువ చేసుకున్న వారు, అంతటి ధనిక కుటుంబమైనా కూడ బాల్యంలో కష్టాలను, ఆకలిని భరించవలసి వచ్చింది. చివరికి ఆటవిక ప్రజల మేకల కాపరిగా ఉండవలసి పరిస్థితి ఏర్పడింది. వారి బాధాకరమైన స్థితిని చూసి ఎవరికి కూడ ఒక్క చుక్క కన్నీరు రాలేదు. చివరికి వారు యుక్తవయస్సుకు చేరుకున్న తరువాత కూడ ఏ పినతండ్రికి కూడ మనము కూడ తండ్రి లాంటి వారమే కదా!, ఒక మంచి సంబంధం చూసి వివాహం చేద్దాం అనే ఆలోచన కూడ రాలేదు. వాస్తవానికి వారి గృహాలలో, వారి బంధువుల గృహాలలో చాలా మంది అమ్మాయిలు ఉన్నారు. కావున ఇక్కడ సహజంగా తలెత్తు ప్రశ్న ఏమిటనగా, ఎందుకు వారు అంటి ముట్టనట్లుగా, ఏమాత్రం పట్టించుకోనట్లుగా ఉన్నారు. అందుకు సరైన సమాధానం వారు మన ప్రియతమ నాయకుడిని, అధికారిని సల్లల్లాహు అలైహి వసల్లంను ఒక అనాథగానే భావించారు. వీరి(స) తండ్రి లేదు, తల్లి లేదు. ఏలాంటి సామాగ్రిలేదు, కనీస అవసరాలు తీర్చు వసతులు లేవు, చేతిలో చిల్లి గవ్వలేదు. ఇలాంటి కష్టజీవిపై సానుభూతి చూపించినచో ఏం ప్రయోజనం కలుగును. వారి (స) అల్లుడిగా స్వీకరించడమనగా తమ కూతురి జీవితాన్ని నాశనం చేసుకోవడమనే భావించేవారు. కాని వారు ఒక రాజపుత్రులు, ఆధ్యాత్మిక చక్రవర్తుల నాయకుడు, వీరికే ప్రపంచ సంపదలకు చెందిన అన్ని తాళపు చెవిలు ఇవ్వబడ్డాయని ఎవరు గుర్తించలేకపోయారు. "

**(ఇజాలే అవ్‌హాం అనుబంధం, రూహాని ఖజాయిన్ సంపుటి 3, పుట 110)**

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9493113322
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: badartel001@gmail.com

REGISTERED WITH THE REGISTER OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్ వార పత్రిక ఖాదియాన్

Distt: Gurdaspur (Pb.) INDIA Qadian - 143516

POSTAL REG NO GDP-38/2020-2022, Vol. 5. Thursday, 22 OCT 2020 Issue No. 43.

MANAGER
NAWAB AHMAD
Mobile. : +91 94170-20616
e-mail:managerbadrqnd@gmail.com
website:www.akhbarbadarqadian.in
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.500/- (Per Issue: 9/- ) (WEIGHT: 20-50, grms / issue)

హజ్రత్ హసన్ బిన్ అలీ రజియల్లాహ్ తాలా అనుహుమా ఇలా ఉల్లేఖించిరి: నేను మా మామ హింద్ బిన్ అబీ హాలను ఆం హజ్రత్ సల్లల్లాము అలైహి వసల్లంను రూపురేఖలను గూర్చి తెలుపమని కోరినాను. వారు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి రూపు రేఖలను వర్ణించుటలో చాలా నేర్పు గలవారు. అందుకే నేను ఆ వర్ణనను గుర్తుంచుకొనుటకు వారిని తెలుపమని కోరినాను. కావున హింద్ ఇలా వర్ణించసాగిరి. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం చాలా ప్రభావశీలురు, గాంభీరమైన రూపు రేఖలను కల్గి ఉండేవారు. వారి శుభప్రదమైన ముఖము నిండు చంద్రుని వలే వెలుగొందేది. సరిపడునంత ఎత్తు కల్గి ఉండేవారు. అనగా చిన్నగా గాకుండా మరియు మిక్కిలి పొడువుగా గాకుండా మధ్యాంతర ఎత్తులో ఉండేవారు. తల పెద్దదిగా, వెంట్రుకలు మందముగా, పొడువుగా చెవులకు తాకునట్లుగా, పాపడకు తీయుటకు అనుకూలముగా ఉండేవి. తెజస్సును వెదజల్లునట్టి తెలుపు రంగులో ఉండేవారు. విశాలమైన నుదటిని కల్గి ఉండేవారు. కనుబొమ్మలు సన్నగా, దిట్టముగా వేరు వేరుగా ఉండేవి. ఆ రెండింటి మధ్యలో తెలుపుదనం కూడ కనిపించేది. కోపంలో చాలా స్పష్టముగా కనిపించేది. ముక్కు సన్నగా దూరము నుండి చూచువారికి పైకి లేచినట్లుగా దానిపై నుండి వెలుగులు విరజిల్లు చున్నట్లుగా కనిపిస్తుంది. చాతిపై గల వెంట్రుకలు దిట్టముగా ఉండేవి. చెంపలు మృదువుగా, సమాంతరముగా ఉండేవి. దవడలు వెడల్పుగా, దంతాలు పదునైనవిగా, తళతళలాడునట్లుగా, కను రెప్పలు సన్నగా ఉండేవి. మెడ నిటారుగా, చంద్రుని వలే స్వచ్ఛముగా, దానిపై ఎరుపుదనం మిరుమిట్లు గొల్పేది. సుందరమైన సృష్టి, శరీరం కొద్దిగా మందముగా, అనువుగా ఉండేది. చాతి, ఉదరం (పొట్ట) రెండు సమానంగా ఉండేవి. చాతి విశాలముగా, వెడల్పుగా ఉండేది. అవయములు నిండుగా, పటిష్టముగా ఉండేవి. చర్మము తళతళలాడుచు, మృదువుగా ఉండేది. చాతి నుండి బొడ్డు వరకు కేవలం ఒక సన్నని వెంట్రుకుల ధార తప్ప వారి చాతిపై గాని, వారి ఉదరంపై గాని ఎలాంటి వెంట్రుకలు ఉండేవి కాదు. మోచేయి నుండి భుజాల వరకు అక్కడక్కడ వెంట్రుకలు ఉండేవి. అరచేతులు వెడల్పుగా, మోచేతులు పొడువుగా మాంసంతో నిండి ఉండేవి. వ్రేల్లు పొడువుగా మందముగా ఉండేవి. కాళ్ళ క్రింది భాగం నిండుగా ఉండేది. పాదములు సుతిమెత్తగా, జాలువారుగా ఉండేవి. అడుగు తీసి అడుగు వేసినప్పుడు పూర్తిగా ఎత్తేవారు. పద్దతిగా నడిచేవారు. ఎత్తునుండి క్రింది దిగుతున్నట్లుగా వడివడిగా నడిచేవారు. ఎవరినైన చూడదలచినచో వారి పూర్తిగా ముఖమును త్రిప్పేవారు. చూపును ఎల్లప్పుడు క్రిందికే మరల్చేవారు. ఆకాశం కన్న అధికముగా నేలపైనే వారి చూపు అధికముగా పడేది. వారు (స) ఎల్లప్పుడు క్రింది చూపుతోనే చూసేవారు. తమ అనుచరుల వెనుకాల నడుచేవారు. వారిని గూర్చి ప్రత్యేక శ్రద్ద కనబర్చేవారు. కనిపించిన వారందరికి వారికన్న ముందే సలాంలు తెల్పేవారు.

**(షమాఇల్ తిర్మిజీ బాబ్ ఫి ఖుల్కి రసూలుల్లాహ్ సల్లల్లాము అలైహి వసల్లం)**

హజ్రత్ హసన్ బిన్ అలీ రజియల్లాహ్ తాలా అనుహుమా ఇలా ఉల్లేఖించిరి: నేను మా మామ హింద్ బిన్ అబీ హాలను ఆం హజ్రత్ సల్లల్లాము అలైహి వసల్లంను సంభాషించు విధానంను గూర్చి తెలుపమని కోరినాను. అందుకు వారు ఇలా తెల్పిరి: ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎల్లప్పుడు ఏదో ఒక తీవ్రమైన ఆలోచనలో ఉండేవారు. వారి తీవ్రమైన ఆలోచనల వలన వారు ప్రశాంతముగా కనిపించేవారు కాదు. వారు (స) అధికముగా మౌనంగానే ఉండేవారు. అనవసరముగా ఎలాంటి సంభాషణలు చేసేవారు కాదు. ఏదేని విషయమును గూర్చి మాట్లాడినచో పూర్తిగా వివరించి మాట్లాడేవారు. వారు సంక్షిప్తముగా మాట్లాడినను పూర్తి భావంతో, అర్థవంతముగా, ఎలాంటి అనవసరపు పదాలను ఉపయోగించకుండా మాట్లాడేవారు. అయినా కూడా ఆ సంభాషణలలో ఎలాంటి లోటుగాని, సంశయం గాని గోచరించేది కాదు. ఎవరిని కూడ అవమానించేవారు కాని, హేళన చేసేవారు కాని కాదు. చిన్న చిన్న అనుగ్రహాలకు కూడ పదే పదే కృతజ్ఞతలు తెలుపేవారు. కృతజ్ఞతభావం అధికముగా కనిపించేది. ఏ వస్తువును కూడ వృధా అని భావించేవారు కాదు. అధిక ప్రశంసలను ఇష్టపడేవారు కాదు. ఆహార పదార్థాలలో రుచికరమైనవి గాని చెదురకమైనవి గాని వచ్చినచో రుచికరమైనవాటిని అతిగా పొగిడేవారు కాదు, చెదువాటిని అతిగా తిరస్కరించే వారు కాదు. ఎల్లప్పుడు మధ్యమమును ఇష్టపడేవారు. ఏదేని ప్రాపంచిక విషయము వలన ఏనాడు కోపగించుకునే వారు కాదు, ఏనాడు చెడుగా భావించుకునే వారు కాదు. కాని ఒకవేళ సత్యమును అవమానించినచో, ఇతరుల హక్కును దొచుకున్నచో వారికి వచ్చే కోపంను ఎవరు కూడ తట్టుకునే వారు కాదు. వారికి వారి హక్కును చెల్లించనంత వరకు హుజూర్ (స) ప్రశాంతముగా ఉండేవారు కాదు. తమ కోసం ఏనాడు కోపగించుకునే వారు కాదు. తమకు జరిగిన అన్యాయంకు ఎవరి నుండి ప్రతికారం తీసుకోవాలని చూసేవారు కాదు. సంజ్ఞ చేసినచో పూర్తి చేతితో చేసేవారు, కేవలం వ్రేళ్ళతో చేసేవారు కాదు. వారు ఆశ్చర్యమును వ్యక్తపర్చు సమయంలో చేతిని త్రిపి ఉంచేవారు. ఏదేని విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోంటున్నప్పుడు వారి కుడిచేతి అరచేయి ఎడమ చేతి బోటనవ్రేళును గట్టిగా అదిమి పట్టుకునే వారు. అయిష్టమైన విషయమును చూసినచో ముఖము త్రిప్పుకునేవారు. సంతోష సమయంలో కన్నులను కొద్దిగా మూసేవారు. వారు అధికముగా నవ్వినను అది చిరునవ్వుగానే ఉండేది. అనగా గట్టిగా ఇతరులకు వినిపించే విధముగా నవ్వేవారు కాదు. వారు నవ్వుచున్నప్పుడు వారి (స) దంతాలు వర్షము కురుస్తున్న సమయంలో మేఘాలలో నుండి మంచు రాళ్ళు పడుచున్నట్లు కనిపించేవి.

**(షమాఇల్ తిర్మిజీ బాబ్ కైఫ కాన కలాము రసూలుల్లాహ్ సల్లల్లాము అలైహి వసల్లం)**

హజ్రత్ జాబిర్ బిన్ సమ్రా రజి యల్లాహు తాలా అనుహుమా ఇలా ఉల్లేఖించిరి: ఒక రాత్రి చంద్రుడు నిండుగా ప్రకాశించుచుండెను. అటు నుండి హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం విచ్చేయుచుండిరి. ఆ సమయంలో హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎరుపు రంగు వస్త్రమును ధరించిరి. ఆ రాత్రి నేను కొంత సమయం ఆం హజ్రత్ సల్లల్లాము అలైహి వసల్లం యొక్క అందమును తిలకించేవాడిని, మరి కొంత సమయం ఆ నిండు చంద్రుని వెన్నల అందాన్ని తిలకించేవాడిని. నిండు చంద్రుడు కురిపిస్తున్న వెన్నల కన్న రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నా దృష్టిలో సౌందర్యవంతముగా కనిపించసాగిరి. **(తిర్మజీ, అబువాబుల్ అదబ్).**

**నూరుల్ ఇస్లాం**

**అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.**

**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**

**సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలువు).**

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz